thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

సూర్యకు కెప్టెన్సీ గండం



11

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 71 | జగిత్యాల | శుక్రవారం | 5 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడిలో లక్షణాల గుర్తింపు
- గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుకు తరలింపు
- నిర్ధారణ కోసం సీసీఎంబీకి శాంపిల్స్ పంపిన వైద్యులు

2





కొడంగల్ ఎత్తిపోతలతో

# లక్ష ఎకరాలకు సాగునీరు

### ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి

- రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం
- కాట్రేవుపల్లి పంప్‌హౌస్ వద్ద కాంక్రీటు పనులు ప్రారంభించాలి
- సోమశిలలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- మంత్రుల బృందంతో కలిసి ఏరియల్ సర్వే
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి కావాలని స్పష్టీకరణ

పాలమూరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా చేపట్టిన మక్తల్-నారాయణ పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిని గురువారం స్వయంగా పరిశీలించిన ఆయన, నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వివరాలు 2వ పేజీలో





2

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్

కేంద్రం సానుకూల స్పందన.. ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు

## పవన్ కల్యాణ్ వ్యతిరేకంగా మాట్లాడారా?



- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బీజేపీ అధ్యక్షుడు

2




## జూన్ 6 నిరసనపై దుమారం

'అడ్డుకుంటే అల్లర్లు' వ్యాఖ్యలతో వైరల్ వీడియో.. సీజేపీ చుట్టూ వివాదం

4

## ఉద్యమకారులకు న్యాయం చేస్తాం!

- అమరవీరుల స్తూపం నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా విజ్ఞప్తుల స్వీకరణ
- సచివాలయంలో ముగిసిన అఖిలపక్ష భేటీ
- త్వరలో విద్యార్థి, ఉద్యమ సంఘాలతో సమావేశాలు
- అందరి అభిప్రాయాలతోనే తుది జాబితా రూపకల్పన
- వివరాలు వెల్లడించిన కేశవరావు, పొన్నం, కోదండరాం

2





2

## దంచికొట్టిన వాన

### పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు

- కరీంనగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు
- ప్రహరీతో పాటు భారీ వృక్షం నేలమట్టం
- ములుగు, సిద్దిపేటలో గాలి దుమారం
- వీడియో తీస్తుండగా పడిన పిడుగు



## అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనంలో చెలరేగిన మంటలు
- సమీప దుకాణాలకు వ్యాపించిన అగ్నికీలలు
- రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది

హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలో గురువారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మైత్రివనం ఎదురుగా ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.



2



## రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు

- ఆర్థిక సంక్షోభ హెచ్చరికపై దుమారం
- ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపణ
- దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న బీజేపీ

4

## డీలిమిటేషన్‌కు కేంద్రం అడుగులు

- 2029 ఎన్నికల ముందే పునర్విభజన లక్ష్యం
- రాజకీయ పార్టీలతో సంప్రదింపులు

4





# ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్

**ఆదిలాబాద్,జూన్4:** ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# అమీర్‌పేట్‌లో భారీ అగ్నిప్రమాదం

**కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనంలో చెలరేగిన మంటలు**




**హైదరాబాద్, జూన్ 4:** హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ ప్రాంతంలో గురువారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మైత్రివనం ఎదురుగా ఉన్న కేఎస్ఆర్ ఫ్యాషన్స్ భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. భవనం నుంచి ఎగిసిపడిన అగ్నికీలలు వేగంగా వ్యాపించడంతో సమీపంలోని దుకాణాలకు కూడా మంటలు అంటుకున్నాయి. మంటలు క్రమంగా విస్తరిస్తుండటంతో వ్యాపారులు, స్థానిక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రమాద తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అగ్నిప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో కొంతసేపు ట్రాఫిక్ రద్దీ నెలకొంది. భద్రతా చర్యల్లో భాగంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా, ప్రాణనష్టం జరిగిందా అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. అగ్నిప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చిన తర్వాత ప్రమాదానికి దారితీసిన కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టనున్నారు.

# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

**సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడిలో లక్షణాల గుర్తింపు**

**గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డుకు తరలింపు**

**నిర్ధారణ కోసం సీసీఎంబీకి శాంపిల్స్ పంపిన వైద్యులు**

**హైదరాబాద్, జూన్ 4:** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎబోలా వైరస్ అనుమానిత కేసు కలకలం రేపింది. సూడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఓ విదేశీ ప్రయాణికుడిలో ఎబోలా లక్షణాలు ఉన్నట్లు గుర్తించిన అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో నిర్వహించిన ఆరోగ్య పరీక్షల్లో ముహమ్మద్ అనే ప్రయాణికుడికి ఎబోలా వైరస్‌కు సంబంధించిన లక్షణాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. దీంతో అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డులో ఉంచారు. నిర్ధారణ పరీక్షల కోసం అతడి శాంపిల్స్‌ను సీసీఎంబీకి పంపినట్లు అధికారులు తెలిపారు. పరీక్షల ఫలితాలు వచ్చే వరకు వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు తెలుస్తోంది. తెలంగాణలో ఎబోలా అనుమానిత లక్షణాలతో వ్యక్తిని గుర్తించడం ఇదే తొలిసారి కావడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఇదిలా ఉండగా, మధ్య ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి కొనసాగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పలు జాగ్రత్త చర్యలు చేపట్టింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎబోలా ప్రభావిత దేశాల నుంచి వచ్చే వారిని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రయాణికుడికి నిజంగా ఎబోలా వైరస్ సోకిందా లేదా అనేది పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాతే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఆరోగ్య శాఖ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం.



# కొడంగల్ ఎత్తిపోతలతో లక్ష ఎకరాలకు సాగునీరు

- ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి
- రైతులకు సకాలంలో సాగునీరు అందించడమే లక్ష్యం
- కాట్రేవుపల్లి పంప్‌హౌస్ వద్ద కాంక్రీటు పనులు ప్రారంభించాలి
- సోమశిలలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష
- ఎత్తిపోతల పథకం పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన
- మంత్రులతో కలిసి ఏరియల్ సర్వే
- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి కావాలని స్పష్టీకరణ



**నారాయణపేట/మహబూబ్‌నగర్, జూన్ 4 :** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం, ఇందులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలనలు, సమీక్షలను ముమ్మరం చేసింది. గురువారం బెంగళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకున్న ముఖ్యమంత్రికి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజీ-1 పనులను స్వయంగా పరిశీలించారు. ప్యాకేజీ-1 లో భాగంగా జరుగుతున్న పంప్‌హౌస్ పనుల పురోగతి ఎంత శాతం పూర్తయిందనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ తక్షణమే కాంక్రీటు పనులను ప్రారంభించి, పనుల వేగాన్ని పెంచాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు భీమా, కృష్ణా నదులపై ప్రతిపాదించిన బ్యారేజీ పనుల పురోగతికి సంబంధించిన ప్లాన్ మ్యాప్స్, ఫోటో ఎగ్జిబిషన్‌ను ఇరిగేషన్ అధికారులు ముఖ్యమంత్రికి వివరించగా, ఆయన దానిని క్షుణ్ణంగా వీక్షించారు. మక్తల్ పర్యటన అనంతరం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై సోమశిలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కీలక భేటీలో రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిలతో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షకు ముందు ముఖ్యమంత్రి మరియు మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం (ఏరియల్ సర్వే) ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు డ్యామ్, అలాగే కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలను సీఎం రేవంత్ రెడ్డి ఆకాశ మార్గం నుండి వీక్షించారు. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యాలపై అధికారులతో ఆరా తీశారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గపరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్‌హౌస్ నిర్మాణ శైలిని, దాని పురోగతిని ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఏరియల్ సర్వే మరియు సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడుతూ.. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టుల పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న సాంకేతిక, ఇతర అడ్డంకులను వెంటనే తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది. ఈ కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, తెలంగాణ ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీర్ ఏ. సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి. శ్రీధర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఉద్యమకారులకు న్యాయం చేస్తాం!

- అమరవీరుల స్తూపం నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా విజ్ఞప్తుల స్వీకరణ
- సచివాలయంలో ముగిసిన అఖిలపక్ష భేటీ
- త్వరలో విద్యార్థి, ఉద్యమ సంఘాలతో సమావేశాలు
- అందరి అభిప్రాయాలతోనే జాబితా రూపకల్పన
- వివరాలు వెల్లడించిన కేశవరావు, పొన్నం, కోదండరాం



**హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం ఆయన అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. సమావేశం అనంతరం కేశవరావు మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలతో మళ్లీ సమావేశమవుతామని చెప్పారు. అందుకోసం వారందరినీ పిలిచి మాట్లాడుతామని పేర్కొన్నారు. తెలంగాణ తొలి దశతో పాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోందని స్పష్టం చేశారు. ఈ అఖిలపక్ష సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నష్టపోయిన అందరికీ అండగా ఉంటామని చెప్పారు. అఖిలపక్షం నుంచి ఒక్కో పార్టీకి ఇద్దరు ప్రతినిధులను ఆహ్వానించామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్టు, న్యాయవాదులు, కవులు, కళాకారులు తదితరులను పిలిచి మాట్లాడుతామని వివరించారు. అమరవీరుల స్తూపం వద్ద ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఉద్యమ సమయంలో తమ యవ్వనం కోల్పోయామని, తమను ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు, యూనివర్సిటీ జేఏసీలతో త్వరలో సమావేశమవుతామని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలతో పాటు అన్ని వర్గాలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని అర్హులైన ఉద్యమకారులను గుర్తిస్తామని ఆయన పేర్కొన్నారు.

# పవన్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

- జనసేన మీటింగ్ కు అనుమతెందుకు ఇవ్వలేదు?
- పవన్ పై విమర్శలకు ముందు పాత చరిత్రను గుర్తుంచుకోవాలి
- సెంటిమెంట్ రాజకీయాలతో బీఆర్ఎస్, కాంగ్రెస్ డ్రామాలు
- సభ పెట్టుకోవడం ప్రజాస్వామ్య హక్కు.. దాన్ని అడ్డుకుంటారా?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు



**హైదరాబాద్, జూన్ 4:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్ కు అనుమతి ఇస్తే ఏమవుతుందని రామచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్ లో రామచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్ ను మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరుపై మండిపడ్డారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంను ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరని ప్రశ్నించారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్ లో చేర్చుకుని పదవులు ఇచ్చింది ఎవరని నిలదీశారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒక్కసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని, నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ జనసేన సభ కోసం అనుమతి అడిగారని, ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదన్నారు. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రామచందర్ రావు డిమాండ్ చేశారు. సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడం ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రామచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్ లో కేసీఆర్ పంచలేదా? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని గుర్తుచేశారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైందని రామచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక్క పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్ కు రేవంత్ రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రామచందర్ రావు అభివర్ణించారు. రానున్న రోజుల్లో బీజేపీ తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

చురకలు



# రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు లేదు!

- శాస్త్రీయ పద్ధతిలోనే భూముల విలువల సవరణ
- అక్రమాలకు తావులేకుండా సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- స్పష్టం చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, జూన్ 4:** రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన ఈ ప్రభుత్వానికి ఏమాత్రం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని గుర్తుచేశారు. ఒక్క శాతం పెంచినా వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతుందనే ఆలోచనతో ప్రజాకోణంలో నిర్ణయం తీసుకున్నామని, వాస్తవానికి దగ్గరగా శాస్త్రీయ పద్ధతిలో భూముల విలువలను సవరించామని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావు ఇవ్వకూడదన్న ఆలోచనతో సబ్ రిజిస్ట్రార్ల అధికారాలను కుదించామని చెప్పారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూముల కనీస విలువ ఎకరానికి రూ. 2.75 లక్షలుగా, మున్సిపల్ కార్పొరేషన్లలో రూ. 5 లక్షలుగా, హెచ్ఎండీఏ పరిధిలో రూ. 10 లక్షలుగా, ఓఆర్ఆర్ పరిధిలో రూ. 15 లక్షలుగా నిర్ణయించామని వెల్లడించారు. సవరించిన విలువలపై ఎక్కువ తక్కువలుంటే సమీక్షిస్తామని తెలిపారు. సవరించిన విలువలపై సందేహాలు, ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1800 599 4788 కు లేదా వాట్సాప్ నంబర్ 8247619983కు సంప్రదించాలని సూచించారు. మంత్రుల శాఖల మార్పుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి పొంగులేటి స్పందించారు. తాను సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చానని, దేవుడి దయ, ప్రజల ఆశీర్వాదంతో ఇంతవరకు ఎదిగానని తెలిపారు. తనకు ఏ శాఖ ఇచ్చినా మనస్ఫూర్తిగా పనిచేస్తానని చెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని, తప్పు చేసే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. ఏ ఫైల్ పై ఇంతవరకు గుడ్డిగా సంతకం పెట్టలేదని, చట్ట ప్రకారం పనిచేస్తున్నానని వెల్లడించారు. రెవెన్యూ శాఖలో అక్రమాలకు పాల్పడ్డవారిపై, ఏసీబీ ట్రాప్ అయిన వారిపై గత ప్రభుత్వంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని మంత్రి ఆరోపించారు. విచారణ జరగకుండా తప్పు చేసిన వారిని తప్పించే ప్రయత్నం చేశారని, మూడు నాలుగేళ్ల పాటు ఫైళ్లను తొక్కిపెట్టారని మండిపడ్డారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 3,500 ఫైళ్లను క్లియర్ చేశానని చెప్పారు. తప్పు చేసిన వారికి శిక్ష పడే విధంగా నిర్ణయాలు తీసుకున్నానని, ఎవర్నీ క్షమించలేదని, ఉపేక్షించలేదని స్పష్టం చేశారు. శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు పదేళ్లు గడిచినా గత ప్రభుత్వం జవాబులు ఇవ్వలేదని, అడిగిన సభ్యుల పదవీకాలం కూడా ముగిసిందని, ఇటీవల ఆ ఫైళ్లన్నీ క్లియర్ చేశానని వివరించారు. గత ప్రభుత్వంలో రిజిస్ట్రేషన్ జరిగిన అసైన్డ్ భూములను ఇప్పుడు నిషేధిత జాబితాలో పెట్టామని మంత్రి తెలిపారు. భూములకు సంబంధించిన ప్రతి డాక్యుమెంట్ ను డిజిటలైజేషన్ చేస్తామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ రద్దు చేయడం సాధ్యం కాదన్నారు. అక్కడ భూములను ఉచితంగా ఇవ్వడం లేదని, రద్దు చేస్తే ప్రభుత్వం డబ్బు తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని, ఇది సాధ్యమయ్యే పని కాదని తేల్చిచెప్పారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల పథకం విజయవంతమైందని మంత్రి పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు. నిరుపేదల సొంత ఇంటి కలను తీర్చే అవకాశం తనకు దక్కడం చాలా తృప్తినిచ్చిందన్నారు. ప్రారంభంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గలేదని, దాని ఫలితమే ఇప్పుడు కనిపిస్తోందని ఆయన వివరించారు.

# రైతులకు భరోసా ఏది?

**వానకాలం సీజన్ వస్తున్నా పట్టని సర్కారు**

**రుణమాఫీపై కార్యాచరణ ప్రకటించాలి**

**మీడియా సమావేశంలో జీవన్ రెడ్డి డిమాండ్**

**జగిత్యాల, జూన్ 4 :** రాష్ట్ర ప్రజానీకంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు కరువైందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా ప్రభుత్వానికి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక లేదని విమర్శించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి ప్రభుత్వం ఇంకా ఎలాంటి కార్యాచరణ రూపొందించలేదని జీవన్ రెడ్డి ఆరోపించారు. కనీసం ఈ ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి పాలనలో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని ఎద్దేవా చేశారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్, బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నాయే తప్ప రైతుల గురించి ఆలోచించడం లేదని జీవన్ రెడ్డి విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం.. వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని ప్రశ్నించారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే రైతులకు 50 శాతం రాయితీతో సోలార్ ఫెన్సింగ్ ఇవ్వాలని కోరారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, వెంటనే యూరియా యాప్ ను తొలగించి నేరుగా రైతులకు అందించాలని ఆయన స్పష్టం చేశారు.





# లాసెట్‌లో దేవ్‌జీ ప్రతిభ!

**349వ ర్యాంకు సాధించిన మాజీ మావోయిస్టు**

**ఏభై ఏళ్లు దాటినా చదువుపై ఎనలేని పట్టుదల**

**న్యాయవాదిగా మారి పేదలకు అండగా ఉంటానని వెల్లడి**

**జగిత్యాల, జూన్ 4:** మావోయిస్టు ఉద్యమ పంథాను వీడి విద్యను ఆయుధంగా ఎంచుకున్న మాజీ మావోయిస్టు అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ లాసెట్ లో ప్రతిభ చాటారు. ఇటీవల విడుదలైన లాసెట్ ఫలితాల్లో ఆయన రాష్ట్ర స్థాయిలో 349వ ర్యాంకు సాధించి అందరి దృష్టిని ఆకర్షించారు. జగిత్యాల జిల్లాకు చెందిన దేవ్ జీ గత నెల 12వ తేదీన కోరుట్లలో నిర్వహించిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాశారు. 50 ఏళ్లు దాటిన వయసులోనూ చదువుపై ఆసక్తి కోల్పోకుండా పట్టుదలతో కృషి చేసి లాసెట్ లో మెరుగైన ర్యాంకు సాధించడం విశేషంగా నిలిచింది. న్యాయ విద్యను అభ్యసించి భవిష్యత్తులో న్యాయవాదిగా మారాలని దేవ్ జీ నిర్ణయించుకున్నారు. పేదలు, నిరుపేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని ఆయన తెలిపారు. ఒకప్పుడు అడవుల్లో ఉంటూ ప్రజా సమస్యల కోసం పోరాడిన ఆయన, ఇప్పుడు చట్టబద్ధ మార్గంలో కోర్టుల ద్వారా ప్రజల పక్షాన నిలబడాలని నిర్ణయించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. సమాజంలో మార్పు కోసం విద్యనే సాధనంగా ఎంచుకున్న దేవ్ జీ విజయం యువతతో పాటు చదువుపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# చార్మినార్ వద్ద కేటీఆర్!

## నిమ్రా కేఫ్ లో సందడి

**ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్ల రుచి**

**పాతబస్తీ పర్యటనపై కేటీఆర్ ట్వీట్.. పోటెత్తిన స్థానికులు, అభిమానులు**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చార్మినార్ వద్ద సందడి చేశారు. పాతబస్తీ పర్యటనలో భాగంగా ఫేమస్ నిమ్రా కేఫ్ ను సందర్శించిన ఆయన.. అక్కడి ప్రసిద్ధ ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లను ఆస్వాదించారు. పాతబస్తీ పర్యటనకు ఇరానీ చాయ్ తోనే సంపూర్ణత్వం వస్తుందని వ్యాఖ్యానించారు.**

**హైదరాబాద్, జూన్ 4:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పాతబస్తీ పర్యటనలో భాగంగా చార్మినార్ సమీపంలోని ప్రముఖ నిమ్రా కేఫ్ అండ్ బేకరీని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రసిద్ధ ఇరానీ చాయ్, ఉస్మానియా బిస్కెట్లను ఆయన ఆస్వాదించారు. అనంతరం ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. హైదరాబాద్ పాతబస్తీకి వెళ్లినప్పుడు అక్కడి ఇరానీ చాయ్ తాగకపోతే ఆ పర్యటనకు సంపూర్ణత్వం ఉండదని పేర్కొన్నారు. చార్మినార్ పక్కనే ఉన్న నిమ్రా కేఫ్ ను సందర్శించి అక్కడి ప్రత్యేక రుచులను ఆస్వాదించడం ఆనందంగా అనిపించిందని ఆయన తెలిపారు. కేటీఆర్ రాకతో చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ఒక్కసారిగా సందడి నెలకొంది. ఆయనను చూసేందుకు అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు.



# క్రీడాకారులకూ కాంగ్రెస్ మోసం!

**స్కేటింగ్ చాంపియన్ తేజేష్ కు ఇచ్చిన చెక్కు బౌన్స్**

**పాలసీ ప్రకారం రూ. 1.55 కోట్లు, ఉద్యోగం ఇవ్వాలి**

**సర్కారు తీరుపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్**

**హైదరాబాద్, జూన్ 4:** పడిగ తేజేష్ అనే యువకుడు స్కేటింగ్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో సుమారు 174 పతకాలు సాధించాడు. ఏషియన్ గేమ్స్, ఓషియానియా (ఆస్ట్రేలియా, న్యూజిలాండ్) ఛాంపియన్ షిప్, ఖేలో ఇండియా లాంటి అనేక పోటీల్లో ప్రతిభ కనబరిచి తెలంగాణకు బంగారు, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించి పెట్టాడు. తెలంగాణ పేరును ప్రపంచ నలుదిశలా వ్యాపించేలా చేసిన ఆ యువకుడికి ప్రభుత్వం ఇచ్చిన రూ. 5 లక్షల చెక్కు బౌన్స్ కావడం దారుణమని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. 2025 స్పోర్ట్స్ డే రోజున రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్వయంగా ఆ ఐదు లక్షల చెక్కును ఇచ్చి, తేజేష్ తో ఫొటో దిగారని ప్రవీణ్ కుమార్ గుర్తుచేశారు. ఆ ఘటన జరిగి పది నెలలు గడిచినా ఇప్పటికీ సాయం అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. క్రీడల్లో తెలంగాణ యువతను ఒలింపిక్స్ వరకు తీసుకెళ్లేలా స్పోర్ట్స్ పాలసీ తెస్తామని, ప్రతి నియోజకవర్గానికి మినీ స్టేడియం కట్టిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు.

### మెస్సీకి మాత్రం కోట్ల ఖర్చా?

అంతర్జాతీయ ఫుట్ బాల్ క్రీడాకారుడు లియోనెల్ మెస్సీని హైదరాబాద్ కు పిలిపించి, కోట్ల రూపాయలు ఖర్చు చేసి సీఎం ఆయనతో కలిసి ఫుట్ బాల్ ఆడారని ప్రవీణ్ కుమార్ ఎద్దేవా చేశారు. మెస్సీతో ఆడేందుకు కోట్లు ఖర్చు పెట్టే ముఖ్యమంత్రికి.. తల్లిదండ్రులు తమ పొలాన్ని తాకట్టు పెట్టి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన స్థానిక క్రీడాకారుడికి సాయం చేయాలన్న సోయి లేదా అని నిలదీశారు. మెస్సీ హైదరాబాద్ కు వచ్చి ఇలాగే క్రీడాకారులను మోసం చేయమని చెప్పారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రకటించిన స్పోర్ట్స్ పాలసీ ప్రకారం తేజేష్ కు అక్షరాలా రూ. 1.55 కోట్లు రావాల్సి ఉందని, ఆ డబ్బును వెంటనే విడుదల చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. తేజేష్ తో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులందరికీ పాలసీ ప్రకారం పారితోషికంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. లేదంటే క్రీడాకారులందరితో కలిసి ఈ మోసపూరిత ప్రభుత్వంతో తాము ఫుట్ బాల్ ఆడాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.



# దంచికొట్టిన వాన

**పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు**

**కరీంనగర్ లో ఇళ్లలోకి చేరిన వరద నీరు**

**ప్రహరీతో పాటు భారీ వృక్షం నేలమట్టం**

**హైదరాబాద్, జూన్ 4:** జనగామ జిల్లా స్టేషన్ ఘన్ పూర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్ లో మోస్తరు వాన కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, మెరుపులతో కూడిన వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో వాన కురిసింది. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కాలనీలకు కాలనీలు నీట మునిగాయి. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొక్లెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ లోని కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరగడంతో అటుగా నిలిపి ఉన్న కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన స్థానికులు.. భారీ ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ లో పిడుగు పడింది. ఓ స్థానికుడు మొబైల్ తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా.. సమీపంలోనే పిడుగు పడటంతో తీవ్రంగా ఉలిక్కిపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు మొబైల్ లో రికార్డయ్యాయి.

# దొర.. సింగిలా? పొత్తా?

**తెలంగాణలో పవన్ పోటీపై ప్రకాశ్ రాజ్ సెటైర్**

**స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన నిర్మాత బండ్ల గణేష్**

**ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయికి చేరిన మాటల యుద్ధం**



**హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై నటుడు ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా సెటైర్ వేశారు. పవన్ ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్ గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి" అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్ రాజ్ పోస్ట్ కు నిర్మాత బండ్ల గణేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రకాశ్ రాజ్ ను ప్రశ్నించారు. "అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా" అంటూ మండిపడ్డారు. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వొద్దని బండ్ల గణేష్ హితవు పలికారు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకోవాలని, ఆ తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయాలని ప్రకాశ్ రాజ్ కు చురకలంటించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణేష్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న ఈ వార్ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఈగిల్ కొరడా!

**అంతర్జాతీయ గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్ట్**

**పట్టుబడిన 12.739 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి**

**ముంబై, థాయ్ లాండ్ కేంద్రంగా భారీ నెట్ వర్క్**

**హైదరాబాద్, జూన్ 4:** మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై రాష్ట్ర ఈగిల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపింది. థాయ్ లాండ్ నుంచి భారత్ కు హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమంగా తరలిస్తున్న అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాను ఛేదించి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుంది. కస్టమ్స్ అధికారులు, పోలీసుల సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ లో 12.739 కిలోల ప్రీమియం హైడ్రోపోనిక్ గంజాయిని పట్టుకున్నారు. దర్యాప్తులో థాయ్ లాండ్, హైదరాబాద్, ముంబై కేంద్రాలుగా భారీ నెట్ వర్క్ నడుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మూడొందల మంది క్యారియర్లను వినియోగించి థాయ్ లాండ్ నుంచి భారత్ కు అధిక టీహెచ్ సీ శాతం కలిగిన గంజాయిని తరలించినట్లు ఈగిల్ ఫోర్స్ వెల్లడించింది. గతంలో అరుదైన వస్తువుల స్మగ్లింగ్ లో పాల్గొన్న ఈ ముఠా 2023 నుంచి మాదకద్రవ్యాల రవాణాపై దృష్టి సారించినట్లు గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఎనిమిదో తేదీన రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన సోధా మొహసన్ బహదూర్ భాయ్ వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాచకొండ పోలీసులు, కస్టమ్స్ అధికారుల సంయుక్త దర్యాప్తులో హరషద్ మన్ సుఖ్ భాయ్ ప్రజాపతి, సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్ లను అరెస్టు చేసి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో గుజరాత్ కు చెందిన దల్ అబ్దుల్లా సదుద్దీన్ నాయ్ యువకులను ప్రలోభపెట్టి గంజాయి రవాణాకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. ముంబైకి చెందిన హేమంగ్ ప్రమోద్ కెలుస్కర్, అతని సోదరుడు సుధాంశు కెలుస్కర్ ఈ రాకెట్ ప్రధాన సూత్రధారులుగా విచారణలో తేలింది. థాయ్ లాండ్ లో క్లబ్ వ్యాపారాన్ని అడ్డాగా చేసుకుని వీరు స్మగ్లింగ్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 40 మంది నిందితులను గుర్తించగా, పలువురిని ఇప్పటికే అరెస్టు చేశారు. మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



# సెంటిమెంట్ ముసుగులో రాజకీయ యుద్ధం!

## అభివృద్ధి ప్రశ్నలకు సమాధానం లేక..

## భావోద్వేగాల రాజకీయమా?

“తెలంగాణను అప్పుల కుప్పగా మార్చి, నిధులు–నీళ్లు–నియామకాల హామీలను గాల్లోకి దీపాల్లా వదిలేసిన వారంతా ఇప్పుడు సెంటిమెంట్ వీరతాళ్లు వేసుకుని ‘నా తెలంగాణ’ అంటూ ఊరేగడం వెనుక ఉన్న అసలు పొలిటికల్ డ్రామా ఏంటి? హైదరాబాద్ మా అయ్య జ్మా రు కాదు అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు నేతలు ఒంటికాలిపై లేవడం వెనుక మళ్లీ దోచుకోవడానికి అవకాశం దక్కదనే భయం దాగి ఉందా? గత పదేళ్ల బీఆర్ఎస్ నిరంకుశ పాలన, ఆపై గత రెండేళ్లుగా భూములు అమ్ముకుంటూ పప్పు బెల్లాల్లా పంచుకుంటున్న కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనుక మోదీ, చంద్రబాబుల ఉమ్మడి వ్యూహం ఉందంటూ గొంతు చించుకోవడం వెనుక ఏ రకమైన స్వార్థ రాజకీయం దాగి ఉందనే చర్చ ఇప్పుడు తెలంగాణ సమాజంలో హాట్ టాపిక్‌గా మారింది.” రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, ఎన్నికలు సమీపిస్తున్న ప్రతిసారీ అస్తిత్వ సంక్షోభం పేరిట ప్రజలను మభ్యపెట్టేందుకు కొందరు నాయకులు నానా య్మా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిజానికి తెలంగాణ ఏర్పడిన తర్వాత జరిగినంత ద్రోహం, దోపిడీ అంతకుముందు ఉమ్మడి రాష్ట్రంలో ఎప్పుడూ జరగలేదనేది అక్షర సత్యం. గత 12 ఏళ్ల కాలంలో ఎక్కడికక్కడ భూములు దోచుకుని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి పాలకులు ఎంజాయ్ చేశారు తప్ప నిరుద్యోగ సమస్య గానీ, నీటి సమస్యలు గానీ తీరలేదు. రైతులు పండించిన ధాన్యం, మక్క జొన్న, మిర్చి, పత్తి పంటలకు మద్దతు ధరలు కల్పించడంలో ఇక్కడి పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రజలకు ఇళ్లు, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ఎరగా వేసి దర్జాగా దోచుకున్నారే తప్ప కొత్తగా ఆస్తులేమీ సృష్టించలేదు. సమయానికి ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని స్థితికి తెచ్చిన వారు.. ఇప్పుడు పవన్ కళ్యాణ్ రాకతో తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడిందంటూ సెంటిమెంట్‌ను మళ్లీ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారు.

తెలంగాణ ప్రజలను ముంచిందే ఈ సెంటిమెంట్ రాజకీయం. దీనిని అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్ల పాటు ఇష్టారాజ్యంగా పాగా వేసి భూములు, డబ్బులు దోచేసింది. దానికి తోడు గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడు–స్తూ భూములను యథేచ్ఛగా అమ్మేస్తోంది. ఈ క్రమంలో పొన్నం ప్రభాకర్, కేటీఆర్, కవిత వంటి నేతలు తామే అసలు సిసలు వారసులమని చెప్పుకుంటూ ఆంధ్రా ఆధిపత్యం వస్తోందని ప్రచారం చేస్తున్నారు. కెసిఆర్ ‘భారత రాష్ట్ర సమితి’ పేరిట దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగినప్పుడు లేని తప్పు, వైఎస్ షర్మిల ఇక్కడ పాదయాత్ర చేసి తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నప్పుడు లేని రోషం.. ఇప్పుడు పవన్ కళ్యాణ్ పోటీ చేస్తామంటే ఎందుకు వస్తోందని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఆంధ్రా వలసవాదానికి ఆద్యుడే కెసిఆర్. ఆయనే నాడు జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు, కృష్ణా నీటిని ఏపీకి దోచిపెట్టారనే ఆరోపణలకు నేటికీ వారి వద్ద సమాధానం లేదు.

### రానున్న ఎన్నికల కోసమేనా?

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలు, ఆ తర్వాతి సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు తమ వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ అస్తిత్వం, స్వాభిమానం, తెలంగాణ హక్కులు వంటి అంశాలు మళ్లీ రాజకీయ అజెండాగా మారుతున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత కూడా తెలంగాణ రాజకీయాల్లో సెంటిమెంట్ ప్రభావం కొనసాగుతుండగా, ప్రజలు మాత్రం అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం వంటి అంశాలపై స్పష్టమైన సమాధానాలు కోరుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తెలంగాణను కొల్లగొట్టడానికి వస్తున్నారని పవన్‌ను విమర్శించే వారు.. ఇక్కడ ధరణి పేరుతో జరిగిన మోసాలు, కాళేశ్వరం దగా, టెలిఫోన్ ట్యాపింగ్, అస్మదీయులకు రాజ్యసభ పదవులు ఇచ్చుకోవడంపై ఎందుకు మాట్లాడటం లేదు? కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రులపై అవినీతి గుప్పుమంటున్నా మేధావులు నోరు మెదపడం లేదు. కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలన సాగిందని కోదండరామ్ లాంటి వారే చెబుతున్నారు. ఈ గడ్డపై నివసిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే, వారి పిల్లల భవిష్యత్తు ఈ రాష్ట్రంతోనే ముడిపడి ఉంది. కెసిఆర్ కుటుంబ పార్టీలే తెలంగాణకు శాశ్వత ప్రతినిధులు కావు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్ర పాలకుల నుంచి నేటి పాలకుల వరకు అందరూ తెలంగాణను దోచుకున్నవారే తప్ప ఎవరూ అస్తిత్వం కోసం పోరాడలేదు. కేవలం తమ ఉనికిని కాపాడుకోవడానికి, స్వార్థ రాజకీయాల కోసమే ఇప్పుడు సెంటిమెంట్‌ను వాడుకుంటూ యా్మ చేస్తున్నారనేది స్పష్టమవుతోంది.

# డీలిమిటేషన్‌కు కేంద్రం అడుగులు

- 2029 ఎన్నికల ముందే పునర్విభజన లక్ష్యం
- రాజకీయ పార్టీలతో సంప్రదింపులు
- దక్షిణాది ఆందోళనలకు పరిష్కార ప్రయత్నాలు
- పార్లమెంట్‌లో కొత్త బిల్లు తెచ్చేందుకు కసరత్తు



**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశంలోని పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో రాజకీయ పార్టీలతో సంప్రదింపులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అవసరమైన చట్టపరమైన మార్పులపై కూడా కేంద్రం దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం దేశంలో లోక్‌సభ స్థానాల కేటాయింపు 1971 జనాభా లెక్కల ఆధారంగా కొనసాగుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా జనాభాలో భారీ మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో తాజా పరిస్థితులకు అనుగుణంగా నియోజకవర్గాల పునర్విభజన అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్త డీలిమిటేషన్ ప్రక్రియకు మార్గం సుగమం చేసే బిల్లును కేంద్రం తీసుకురావచ్చని ప్రచారం జరుగుతోంది. పునర్విభజన అమలులోకి వస్తే పలు రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్యలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. జనాభా పెరుగుదల అధికంగా ఉన్న రాష్ట్రాలకు అదనపు ప్రాతినిధ్యం లభించే అవకాశముండగా, కొన్ని రాష్ట్రాల్లో ప్రస్తుత రాజకీయ సమీకరణాలు మారే పరిస్థితి ఏర్పడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై విస్తృత రాజకీయ ఏకాభిప్రాయం సాధించేందుకు కేంద్రం ప్రాంతీయ పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. పలు రాష్ట్రాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల అభిప్రాయాలను తెలుసుకుని వివాదాలకు తావులేకుండా ముందుకు సాగాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే డీలిమిటేషన్ ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జనాభా నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించిన రాష్ట్రాలకు నష్టం కలగకూడదనే అభిప్రాయం అక్కడి రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది. ఈ ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా సమతుల్య విధానాన్ని రూపొందించేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ పార్టీలతో సంప్రదింపులు పూర్తైన తర్వాత డీలిమిటేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశముందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ ప్రక్రియ పూర్తయితే దేశ రాజకీయ పటంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

# రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు

**ఆర్థిక సంక్షోభ హెచ్చరికపై దుమారం**

**ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపణ**

**దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందన్న బీజేపీ**



**న్యూఢిల్లీ, జూన్ 4 :** దేశంలో త్వరలోనే ఆర్థిక సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని, పరిస్థితులు మరింత దిగజారితే అత్యవసర పరిస్థితుల తరహా పరిణామాలు చోటుచేసుకోవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నమని ఆరోపించింది. కాంగ్రెస్ గిరిజన విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన రాహుల్ గాంధీ దేశంలో ధరలు పెరుగుతున్నాయని, సామాన్య ప్రజలపై ఆర్థిక భారం అధికమవుతోందని అన్నారు. గతంలో దేశాన్ని ఆర్థిక ఒత్తిళ్ల నుంచి కాపాడిన పలు వ్యవస్థలు బలహీనపడ్డాయని ఆరోపించారు. ప్రజల అసంతృప్తిని అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని కూడా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ వ్యాఖ్యలను నిరాధార ఆరోపణలుగా కొట్టిపారేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటోందని, భారత ఆర్థిక పరిస్థితి పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి సూచీలు, పెరుగుతున్న పెట్టుబడులు, పారిశ్రామిక వృద్ధి, విదేశీ మారక నిల్వలు ఆర్థిక బలానికి నిదర్శనమని వివరించారు. బీజేపీ ఐటీ విభాగం జాతీయ ఇన్‌ఛార్జి అమిత్ మాలవీయ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందిస్తూ, రాహుల్ వ్యాఖ్యలు ప్రజల్లో భయాన్ని పెంచే ప్రయత్నమని విమర్శించారు. గత పదేళ్లలో దేశ ఆర్థిక రక్షణ వ్యవస్థలు మరింత బలపడ్డాయని, ద్రవ్యోల్బణం నియంత్రణ, పెరుగుతున్న విద్యుత్ వినియోగం, వాహన విక్రయాలు, విదేశీ మారక నిల్వలు వంటి అంశాలు దేశ ఆర్థిక స్థిరత్వాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్రమంత్రి లలన్ సింగ్ కూడా రాహుల్ వ్యాఖ్యలపై స్పందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రజాస్వామ్య విలువలకు ప్రధాని నరేంద్ర మోదీ కట్టుబడి ఉన్నారని అన్నారు. గతంలో దేశంలో అమలైన అత్యవసర పరిస్థితులను గుర్తు చేస్తూ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు, వాటిపై బీజేపీ నేతల ప్రతిస్పందనతో దేశ రాజకీయాల్లో మరోసారి ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణ అంశాలు చర్చకు వచ్చాయి. ఇరు పార్టీల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతుండగా ఈ అంశం జాతీయ రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# జూన్ 6 నిరసనపై దుమారం

**‘అడ్డుకుంటే అల్లర్లు’ వ్యాఖ్యలతో వైరల్ వీడియో.. సీజేపీ చుట్టూ వివాదం**

**న్యూఢిల్లీ:** ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ)కి సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. పార్టీ మద్దతుదారుడిగా చెప్పబడుతున్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వైరల్ అవుతున్న వీడియోలో అమిత్ కుమార్ సింధ్ అనే వ్యక్తి మాట్లాడుతూ, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగే అవకాశం ఉందని వ్యాఖ్యానించినట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే నిరసనలో పాల్గొనేవారు తమ రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, కర్రలు వెంట తెచ్చుకోవాలని సూచించినట్లు వీడియోలో కనిపిస్తోంది. పోలీసులు నిరసన కార్యక్రమాన్ని అడ్డుకునే అవకాశం ఉందని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చినట్లు తెలుస్తోంది. వీడియోలోని మరో భాగంలో “ఇప్పటివరకు చాలా భరించాం.. ఈసారి హద్దులు దాటుతాం” అంటూ చేసిన వ్యాఖ్యలు మరింత వివాదానికి కారణమయ్యాయి. దీంతో సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నెల 6న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమానికి అనుమతి కోరనున్నట్లు తెలిసింది. వైరల్ వీడియోపై వివాదం నెలకొన్న నేపథ్యంలో స్పందించిన అభిజీత్ దీప్కే, తమ ఉద్యమం పూర్తిగా శాంతియుత పద్ధతుల్లోనే కొనసాగుతుందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసముందని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు ఉందని పేర్కొన్నారు. అయితే వివాదాస్పద వ్యాఖ్యల నేపథ్యంలో జూన్ 6న జరగనున్న నిరసన కార్యక్రమంపై పోలీసు వర్గాలు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. నిరసన శాంతియుతంగా, చట్టబద్ధమైన పరిమితుల్లోనే కొనసాగుతుందా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఎయిర్‌పోర్టులో భారీ విదేశీ కరెన్సీ స్వాధీనం

- ముంబై సీఐఎస్ఎఫ్ అప్రమత్తతతో వెలుగులోకి ఘటన
- కోటి ముప్పై తొమ్మిది లక్షల విలువైన డాలర్లు గుర్తింపు





**ముంబై, జూన్ 4:** ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సిబ్బంది అప్రమత్తతతో భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ పట్టుబడింది. సాధారణ భద్రతా తనిఖీల సమయంలో ఎక్స్–రే సామగ్రి పరిశీలన వ్యవస్థలో అనుమానాస్పద వస్తువు గుర్తించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రయాణికుడి చేతి సామానును క్షుణ్ణంగా తనిఖీ చేయగా, ప్రకటించని విదేశీ కరెన్సీ బయటపడింది. మొత్తం లక్షా నలభై ఐదు వేల అమెరికన్ డాలర్లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భారత కరెన్సీలో దీని విలువ సుమారు కోటి ముప్పై తొమ్మిది లక్షల రూపాయలుగా అంచనా వేస్తున్నారు. ఈ విదేశీ కరెన్సీని తీసుకెళ్తున్న వ్యక్తి విదేశీ పౌరుడిగా గుర్తించారు. అతను ముంబై నుంచి అడిస్ అబాబా నగరానికి ప్రయాణిస్తున్న సమయంలో ఈ తనిఖీలు నిర్వహించారు. అవసరమైన అనుమతులు లేకుండా భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ తరలించే ప్రయత్నం చేసినట్లు అధికారులు గుర్తించారు. వెంటనే ఆ వ్యక్తిని, స్వాధీనం చేసుకున్న కరెన్సీతో పాటు కస్టమ్స్ అధికారులకు అప్పగించినట్లు సీఐఎస్ఎఫ్ తెలిపింది. ఈ ఘటనపై కస్టమ్స్ శాఖ అధికారులు తదుపరి విచారణ చేపట్టారు. విమానాశ్రయ భద్రతలో భాగంగా నిర్వహించే తనిఖీల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది చూపిన అప్రమత్తత వల్ల ఈ అక్రమ రవాణా యత్నం విఫలమైందని అధికారులు పేర్కొన్నారు. దేశ భద్రత, ఆర్థిక నేరాల నిరోధంలో భద్రతా బలగాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భద్రతా తనిఖీలు మరింత కట్టుదిట్టంగా కొనసాగుతున్నాయని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# రాజ్యసభ ఎన్నికల అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ

**ఢిల్లీ:** రాజ్యసభ ఎన్నికలు, ఒడిశా ఉప ఎన్నికకు సంబంధించి బీజేపీ తన అభ్యర్థుల జాబితాను గ్నురువారం ప్రకటించింది. మొత్తం 11 మంది అభ్యర్థులతో జాబితాను ప్రకటించింది. రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా సతీశ్ పూనియా, అల్కా గుర్జర్, మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీశ్ అగ్రవాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి తాయ్ తాగాక్, మణిపూర్ నుంచి శారదా దేవిని బరిలోకి దింపింది. గుజరాత్ నుంచి రాజూభాయ్ శుక్లా, ముకేశ్‌భాయ్ రాత్వా, మాన్‌సింగ్ పర్మార్, జితేంద్రసింగ్, మేఘ్‌జీభాయ్ కంజారియా బరిలో నిలిచారు. ఇక ఒడిశా రాజ్యసభ ఉపఎన్నికలో దేబాశిష్ సామంతరాయ్‌ను రంగంలోకి దించింది. జూన్ 18న ఎగువ సభకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈ రాష్ట్రాల్లో బీజేపీకి మెజారిటీ ఉన్న నేపథ్యంలో అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడకే అని విశ్లేషకులు అంటున్నారు. 245 సభ్యులున్న రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యా బలం 148కాగా, బీజేపీ ఎంపీలు 113 మంది ఉన్నారు. ఇక రాజ్యసభ ఎంపీలు హర్దీప్ సింగ్ పురీ, దినేశ్ శర్మ, అరుణ్ సింగ్, ప్రొఫెసర్ రామ్ గోపాల్ యాదవ్‌ల పదవీ కాలంలో కూడా నవంబర్‌లో పూర్తికానుంది.

చురకలు



# అంతర్రాష్ట్ర కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్ ను అరెస్ట్ చేసిన వికారాబాద్ జిల్లా పోలీస్.

### జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ అదేశాలమేరకు





**వికారాబాద్, జూన్,04(:** వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో గత నెల (01.05.2026న) రాత్రి సమయం లో ఒకరి ఇంట్లోకి చొరబడి ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 2,10,000 నగదును అపహరించిన చోరీ కేసును పోలీసులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకున్న వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ఆదేశాల మేరకు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య ఆధ్వర్యంలో సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, వికారాబాద్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ ల నేతృత్వంలోని ప్రత్యేక బృందం రంగంలోకి దిగింది. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారం, మరియు నేరస్థుల కదలికలను సిసి కెమెరాల ఆదారాలను విశ్లేషిస్తూ లోతైన దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చివరకు నేర స్థలంలో సేకరించిన సాంకేతిక సాక్ష్యాల ఆధారంగా ఈ చోరీకి పాల్పడిన ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్ గా గుర్తించారు.

**సినిమా స్టైల్లో దొంగతనాలు - దొంగసొమ్ముతో సేవా కార్యక్రమాలు -విలాసవంతమైన జీవితం:**

ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా ఐడీఏ బొల్లారంలోని పోచమ్మ బస్తీ,గాందీనగర్ మరియు సూరారం(సాయిబాబా నగర్) పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటున్న వికాస్ సింగ్, పైకి కూలీ పనులు చేస్తున్నట్లు నటిస్తూ రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడేవాడు. గతంలో ఇతను దొంగతనం చేసిన ఏరియాలు అయిన నర్సాపూర్, మేడ్చల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నేరాల్లో ఇతనే దొంగతనం పాల్పడినట్లు సాంకేతిక ఆదారాలు లభించాయి. దీనితో నిందితుడిపై గట్టి నిఘా పెట్టిన జిల్లా పోలీస్ అధికారులు, అర్ధరాత్రి సమయంలో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు నమ్మలేని నిజాలు వెల్లడించాడు. 16 ఏళ్ల మైనర్ వయ-సులోనే నేర జీవితాన్ని ప్రారంభించిన ఇతనిపై గతంలో సంగారెడ్డి, బొల్లారం పరిసర ప్రాంతాలలో సుమారు 34 రాత్రి వేళల దొంగతనం కేసులు ఉన్నాయి. 2018లో నాలుగు, 2021లో తొమ్మిది, 2022లో 21 కేసుల్లో సంగారెడ్డి పోలీసులు ఇతడిని అరెస్ట్ చేయగా, జైలు శిక్ష అనుభవించి 2024 జూన్ 26 నాడు జైలు నుండి విడుదలయ్యాడు.అయినప్పటికీ ఇతని ప్రవర్తనలో మార్పు రాకపోగా, తిరిగి వికారాబాద్ జిల్లా, సైబరాబాద్, మల్కాజ్‌గిరి పరిధుల్లో మొత్తం 27 రాత్రి పూట దొంగతనాలకు పాల్పడి 157 తులాల బంగారం, 256 తులాల వెండి, రూ. 8,22,500 నగదును దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దొంగతనం ద్వారా వచ్చిన డబ్బుతో నిందితుడు జల్సాలు చేయడమే కాకుండా, తన స్వగ్రామంలో ప్రజలకు 'హెల్పింగ్ హ్యాండ్'అనే ఎన్‌జిఓ పేరుతో డబ్బులు స్కూల్స్ లో బ్యాగులు,నోట్ బుక్ లు పంచుతూ, స్నేహితులను విహారయాత్రలకు చెన్నై, గోవా, విజయవాడ, ప్రాంతాలు అయిన కుర్వర్ మరియు గంజేరి క్రింద ఉన్న బంగారం షాప్ యజమానులకు అమ్మ ద్వారా అమ్మేవాడని విచారణలో తేలింది:

1) శ్యామ్ మోహన్ (బాబా శాలిక్ రామ్, బంగారం షాప్ యజమాని) -- నివాసం: కుర్వర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ *(UP)*.

2) సూరజ్ మోహన్ (బాబా శాలిక్ రామ్,బంగారం షాప్ యజమాని) -- నివాసం: కుర్వర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్ *(UP)*.

3) అశోక్ సోని (అశోక్ సోని జెవెలర్స్ యజమాని) -- నివాసం: కుర్వర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్

4) వికాస్ అగ్రహారి (వికాస్ జెవెలర్స్ స్టోర్--గంజేరి)-- నివాసం: భగ్వాన్ పూర్, సుల్తాన్‌పూర్ జిల్లా, ఉత్తరప్రదేశ్

మైనర్‌గా ఉన్నప్పుడు దొంగతనాలు చేసిన మాట వాస్తవమేనని, అయితే తర్వాత ఈ బంగారం షాప్ యజమానులు దొంగసొమ్ము ద్వారా ఎక్కువ లాభాలు గడించడం అలవాటు పడి, ఇతర రాష్ట్రాలలో దొంగతనాలు చేసి తమకు బంగారం అమ్మితే ఎలాంటి ఇబ్బందులు ఉ ఒడవని, తనను ప్రోత్సహించారని నిందితుడు ఒప్పుకున్నాడు. తన దగ్గర డబ్బులు లేకపోయినా ముందే డబ్బులు ఇచ్చి మరి నేరాలకు పురికొల్పేవారని, ఒకానొక దశలో తను దొంగతనాలు చేయడానికి భయపడితే, పైన పేర్కొన్న యజమానులందరూ తలా రూ. 10,000 చొప్పున మొత్తం నమోదయ్యాయని ఎస్పీ తెలిపారు.తేదీ 26.06.2024 నుండి ఇప్పటి వరకు చేసిన నేరాలు ఒప్పుకున్న 27 కేసులలో నేరస్థున్ని అరెస్టు చేయడం జరుగుతుంది. మరియు ప్రస్తుతం నిందితుని నుండి తులంన్నర బంగారం ఆభరణాలు, మరియు ఒక తుపాకీ (5ఎంఎం పిస్తోల్) ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**రిసీవర్లపై కఠిన చర్యలు --ఎస్పీ హెచ్చరిక:-**

పైన పేర్కొన్న బంగారం దుకాణాల యజమానులందరూ ఒక సిండికేట్ (ఆర్గనైజర్లు) గా ఏర్పడి, నిందితుడితో చేయికలిపి దొంగతనాలు చేయిస్తున్నట్లు మరియు అక్రమంగా అయూదాలు కొనడానికి ప్రోత్సహించడం జరుగుతుంది అని దర్యాప్తులో తేలడంతో, సదరు యజమానులపై కూడా ఆర్గనైజేడ్ క్రైమ్ , ఆర్మ్స్ యాక్ట్ ,అలవాటు పడ్డ నేరస్తులు, సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం జరుగుతుంది. అవసరమైతే వీరిపై పీడీ యాక్ట్ (గూణ చాష్) కూడా నమోదు చేస్తామని వికారాబాద్ ఎస్పీ హెచ్చరించారు. ఈ దొంగసొమ్ము రిసీవర్లను ఖచ్చితంగా అరెస్ట్ చేయడానికి ఒక సీనియర్ పోలీస్ అధికారితో ప్రత్యేక దర్యాప్తు టీమ్‌ను ఏర్పాటు చెయ్యడం జరుగుతుంది,దొంగ సొత్తు స్వాదీనం చేసుకొని వారిని ఖచ్చితంగా అరెస్ట్ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాము.జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, కాలనీలు, గ్రామాల్లో ఎవరైనా గుర్తుతెలియని లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వికారాబాద్ ఎస్పీ కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలని, ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలను అరికట్టవచ్చని సూచించారు. ప్రజల రక్షణే ధ్యేయంగా పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని భరోసా ఇస్తూ, ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీస్ అధికారులను సంప్రదించాలని వికారాబాద్

# గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇవ్వండి

- **అక్రెడిటేషన్ తో సంబంధం లేకుండా ఇవ్వాలి**
- **ముఖ్యమంత్రికి జీహెచ్ జే సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి**

**హైదరాబాద్, జూన్ 03:**




సుప్రీం కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా వర్కింగ్ జర్నలిస్ట్స్ యాక్ట్ ప్రకారం అన్ని కేటగిరీల్లోని జర్నలిస్టులకు ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం విజ్ఞప్తి చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జర్నలిస్టులందరికి వెంటనే ఇళ్ళస్థలాలు కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా.. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకపోవడం విచారకరమని పలువురు సీనియర్ జర్నలిస్టులు అన్నారు. బుధవారం హైదరాబాద్ చిక్కడపల్లి లోని శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన సొసైటీ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాలు, సుప్రీంకోర్టు తీర్పు, ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీకి స్థలం లేదా సభ్యులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సమావేశం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరుతూ తీర్మానించింది.

అక్రెడిటేషన్ కార్డుతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం ఇవ్వాలని, జర్నలిస్టుల్లో వివక్ష చూపొద్దని సమావేశం కోరింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కేటగిరీల జర్నలిస్టులకు 200 చ. గ స్థలాన్ని ఫ్యూచర్ సిటీలో కేటాయించాలని కోరుతూ సమావేశం తీర్మానించింది.

సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, సొసైటీలో సభ్యత్వం తీసుకున్న 1350 మంది గ్రేటర్ జర్నలిస్టులు 18 ఏళ్ళుగా ఇంటి జాగల కోసం ఎదురు చూస్తున్నారని, గత ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం ఈ ప్రభుత్వం అయినా ఇళ్ళస్థలాలిచ్చి ఆదుకోవాలని కోరారు. గ్రేటర్ సొసైటీలో ఉన్న దాదాపు 1350 మంది జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం చాలా ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారని, ఇప్పటికే ఎంతోమంది జర్నలిస్టులు స్థలం పొందకుండానే చనిపోయారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, పలువురు మంత్రులను కలిసి పలుమార్లు విన్నవించినప్పటికీ స్థలం కేటాయింపునకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా ప్రభుత్వం చేతులెత్తేసిందని, మొన్న జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ళస్థలాలపై ఎటువంటి నిర్ణయం లేదని, నిన్న జరుపుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంలో జర్నలిస్టుల సంక్షేమం, ఇళ్ళస్థలాల మాటే లేదని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పును పక్కన పెట్టి ప్రత్యామ్నాయ జీవోల ద్వారా జర్నలిస్టు సొసైటీలకు స్థలాలు ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రిని కోరారు.



### మద్దతు ప్రకటించిన కోదండరాం

సొసైటీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావాల్సి ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అనివార్యకారణాల వల్ల హాజరుకాలేకపోయారు. దీంతో ఆయన ఫోన్ ద్వారా తన సందేశాన్ని సమావేశానికి వినిపించారు. గ్రేటర్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి తన మద్దతు ఉంటుందని, ముఖ్యమంత్రితో మాట్లాడి జర్నలిస్టులకు ఇళ్ళస్థలాలు ఇచ్చేవిధంగా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా సమావేశానికి రావాల్సిన రాజ్యసభ సభ్యులు ఎం. అనిల్ కుమార్ యాదవ్ కూడా అత్యవసర పని వల్ల రాలేకపోయారు. ఆయన కూడా సొసైటీ సమావేశానికి మద్దతు తెలియజేశారు. అంతకు ముందు సొసైటీ కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నైశిదం సత్యనారాయణ మూర్తి, తెలంగాణ జనసమితి గ్రేటర్ బీసీ సెల్ అధ్యక్షుడు జశ్వంత్, సీనియర్ జర్నలిస్టులు తీగవరపు శాంతి, నాగవాణి, సొసైటీ కోశాధికారి తన్నీరు శ్రీనివాస్, డైరెక్టర్లు యర్రమిల్లి రామారావు. రమాదేవి పాల్గొన్నారు.

# మన సంస్కృతి, సంప్రదాయాలే మనకు శ్రీరామరక్ష

- **పోతంగల్ సమ్మేళనంలో విశోక తీర్థస్వామి**





**పోతంగల్, జూన్ 04, ) :-**నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని సాయిబాబా కల్యాణ మండపంలో బుధవారం సాయంత్రం 'విరాట్ హిందూ ఆత్మీయ సమ్మేళనం' అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (=ూా) వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం, హిందూ సమాజ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముందు మండల కేంద్రంలోని బస్టాండ్ నుండి సాయిబాబా కల్యాణ మండపం వరకు హిందూ బంధువులు భారీ శోభాయాత్ర నిర్వహించారు. ఆధ్యాత్మిక శోభతో సాగిన ఈ యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం కల్యాణ మండపంలో జ్యోతి ప్రజ్వలనతో సమ్మేళనాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన, తా యజ్ఞం ట్రస్ట్ వ్యవస్థాపకులు విశోక తీర్థస్వామి మాట్లాడుతూ, హిందూ ధర్మం ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైనదని మరియు శ్రేష్టమైనదని పేర్కొన్నారు. మన పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాలు మరియు దైవ భక్తిని నేర్పించాల్సిన బాధ్యత ప్రతి తల్లిదండ్రిపై ఉందని ఆయన ఉద్ఘాటించారు. నేటి కాలంలో పిల్లలు సెల్ ఫోన్లకు బానిసలవుతున్నారని, వారిని అటు వంటి వ్యామోహాలకు దూరంగా ఉంచి, రామాయణ, భారతాల వంటి ఇతిహాసాల గురించి తెలియజేయాలని సూచించారు. అప్పుడే పిల్లల్లో నైతిక విలువలు, భగవంతుని పట్ల భక్తి పెంపొందుతాయని ఆయన తెలిపారు. హిందూ ఆత్మీయ సమ్మేళనం కేవలం ఒక సమావేశం మాత్రమే కాకుండా, హిందూ సమాజాన్ని ఏకం చేసే ఒక మహా వేదిక అని, దీని ద్వారా ఐక్యతను చాటిచెప్పడం మరియు మన సంస్కృతిని, ధర్మాన్ని తర్వాతి తరాలకు అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ ప్రచారక్, తెలంగాణ ప్రాంత సహ భౌద్ధిక్ ప్రముఖ్ నర్రా వెంకట శివకుమార్, మంగళ శ్రీకరి యశస్వి, స్థానిక ప్రముఖులు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రల నుండి ధాన్యాన్ని మిల్లర్లకు వేగవంతంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలి

- **అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఐఏఎస్**



**కొడంగల్ మున్సిపల్,(మం) జూన్,04( :** వరి కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లర్లకు వేగవంతంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అధికారులను ఆదేశించారు.వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రాంతంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాం, హస్నాబాద్,మరియు కొడంగల్ వెంకటేశ్వర రైస్ మిల్లర్ల కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి వరి ధాన్యం నిల్వలను పరిశీలించారు.రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాల మేరకు వరి ధాన్యాన్ని తరలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.మిల్లుల వద్ద ధాన్యం దించుకోవడంలో జాప్యం లేకుండా ఎక్కువ సంఖ్యలో హమాలీలను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.లారీ ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు ధాన్యాన్ని సకాలంలో చేర్చేందుకు వీలుగా అదనంగా లారీలను సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు.వరి కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు గోనే సంచులు, తూనీక, తేమ యంత్రాలు, తాడిపత్రులు, అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ కె.వెంకటాచారి, పౌర సరఫరాల అధికారి సుదర్శన్, జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, కొడంగల్ పీఏసీఎస్ చెర్మెన్ శివకుమార్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

# యువత ఉపాధి అవకాశాల పెంపుకు పరిశ్రమలు అప్రెంటిస్ అవకాశాలు కల్పించాలి

- **కలెక్టర్ రాహుల్ శర్మ**

**భూపాల పల్లి జూన్ 4(** యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లాలోని పరిశ్రమలు అప్రెంటిస్ నియామకాల్లో చురుకుగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు.ఐడీఓసీ కార్యాలయంలో గురువారం ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాల కల్పనపై పరిశ్రమలు, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యాసంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు నాట్స్ (చీూఖా) ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకుని అప్రెంటిస్ నియామకాలు చేపట్టాలని సూచించారు. అప్రెంటిస్ అవకాశాల ద్వారా విద్యార్థులు ప్రాయోగిక నైపుణ్యాలు పెంపొందించుకుని ఉద్యోగ అవకాశాలను మెరుగుపర్చుకోగలరని తెలిపారు.జెన్కో, ఏఎంఆర్ తాడిచర్ల వంటి పరిశ్రమలు అప్రెంటిస్ అవకాశాల కల్పనలో ముందుండాలని, అవసరమైతే అనుమతుల కోసం తాను సిఫారసు చేస్తానని హామీ ఇచ్చారు.అన్ని పరిశ్రమలు అప్రెంటిస్ నియామకాల్లో భాగస్వాములు కావడం ద్వారా యువత ఉపాధి అవకాశాల పెంపుకు సహకరించాలని కలెక్టర్ కోరారు.సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సిద్ధార్థ రెడ్డి, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ ధాన్యం నిల్వ కేంద్రాల తనిఖీ



**భూపాల పల్లి , జూన్ 4:,(** అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ గురువారం కాటారం మండలంలోని ఏఎంసీ గోదాం, రుద్ర కాటన్ మిల్లు, మీనాక్షి జిన్నింగ్ మిల్లులను పరిశీలించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను సమీక్షించారు.

ఈ సందర్భంగా ధాన్యం దిగుమతి, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.గోదాంలలో అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు భద్రతా ప్రమాణాలు పాటించాలని, ధాన్యం నాణ్యత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ తనిఖీలో డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి: కలెక్టర్

**భూపాలపల్లి, జూన్ 4:(** . ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, కేజీబీవీలు, మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చేరికలపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ రూపొందించిన విద్యా పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# జనగామలో 62 రైతు సేవా కేంద్రాలకు లైసెన్సులు -- ఈ-పాస్ మిషన్ల పంపిణీ

**జనగామ జిల్లాలో ఒకే రోజు 62 రైతు సేవా కేంద్రాలకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల విక్రయ లైసెన్సులు జారీ చేయడం ప్రత్యేక ఘట్టం**



**జనగామ జూన్4( :** గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలకు ఈ-పాస్ (జుూూూ) మిషన్లను పంపిణీ చేశారు.రాష్ట్రంలోనే తొలిసారిగా ఇంత పెద్ద సంఖ్యలో రైతు సేవా కేంద్రాలకు ఒకేసారి లైసెన్సులు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సేవలను ఒకే వేదికపై పారదర్శకంగా, వేగవంతంగా అందించడమే లక్ష్యమన్నారు.

నిల్వలు, పంపిణీ, విక్రయాలకు సంబంధించిన రికార్డులను ఖచ్చితంగా నిర్వహించాలని, రైతులతో సౌమ్యంగా వ్యవహరించాలని సూచించారు. రైతు వేదికల ద్వారా ఏఈఓలు శిక్షణ అందిస్తారని తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు వంటి మరిన్ని సేవలను కూడా ఈ కేంద్రాల ద్వారా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోందని వెల్లడించారు.

# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, జూన్ 4(** . బడిబాట కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించి ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు.ఎంపీడీవోలు, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మన ఊరు--మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి జూన్ 12 నాటికి పాఠశాలలను సిద్ధం చేయాలన్నారు.అలాగే వంట సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించడం, బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం, ప్రైవేట్ స్కూల్ వాహనాలకు ఫిట్‌నెస్ తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

# ధాన్యం బస్తాల లోడింగ్ వేగవంతం చేయాలి

■ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ, జూన్ 4( :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.గురువారం బచ్చన్నపేట మండలం తమ్మడపల్లి గ్రామంలోని పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి కొనుగోళ్ల నిర్వహణ, ధాన్యం రవాణా, ఓపీఎంఎస్ నమోదు, ట్రక్ షీట్లు, కాంటా వివరాలను పరిశీలించారు.కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం, కాంటా చేయాల్సిన పరిమాణం, లారీల రాకపోకలు, అన్‌లోడింగ్ పురోగతిపై ఆరా తీశారు. ధాన్యం నిల్వలు పెరగకుండా రవాణా ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.ఓపీఎంఎస్ నమోదును వేగవంతం చేసి రైతుల వివరాలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# పంట అవశేషాల కాల్చివేతపై సంపూర్ణ నిషేధం



**హనుమకొండ, జూన్ 4( :** పంట అవ శేషాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరగడంతో పా టు పర్యావరణ సమతుల్యత దెబ్బతిని, నేల సారవంతత తగ్గిపోవడం, ప్రజారోగ్యం ప్రమాదంలో పడటం వంటి తీవ్ర పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో హనుమకొం డ జిల్లా వ్యాప్తంగా పంట వ్యర్థాల కాల్చివేతను తక్షణమే నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ ౚ జిల్లా మేజిస్ట్రేట్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ ఉత్తర్వులు జారీ చేశారు.వ్యవసాయ పంటల కోత అనంతరం పొలాల్లో మిగిలిపోయే పంట అవశేషాలను తగులబెట్టడం వల్ల హానికర వాయువులు వెలువడి వాతావరణ కాలుష్యం పెరగడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం, మానవ జీవనం, రహదారి భద్రత మరియు పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అంతేకాకుండా భూమిలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూసారం క్షీణిస్తుందని తెలిపారు.ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, ప్రజా శాంతిభద్రతల దృష్ట్యా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (దీచీూా)-2023 సెక్షన్ 163 కింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలు, వ్యవసాయ భూములు, పొలాల్లో పంట అవశేషాల కాల్చివేతను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నిషేధిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (దీచీూ)-2023 సెక్షన్ 223 ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉల్లంఘన వల్ల ప్రజలకు ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు లేదా మానవ ప్రాణాలకు ప్రమాదం కలిగితే జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు.జిల్లాలోని తహశీల్దార్లు, ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పంట కోతల సమయంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ శాఖలు సమన్వయంతో పనిచేసి ఉత్తర్వులను కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించారు."పంట అవశేషాలను కాల్చడం అంటే భూమాతను, పర్యావరణాన్ని, మన భవిష్యత్తును కాల్చినట్టే. రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి. ప్రతి గ్రామం కాలుష్య రహితంగా, ప్రతి పొలం సారవంతంగా ఉండేలా అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు.

# గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు అందరూ బాధ్యత వహించాలి

● కలెక్టర్ స్నేహ శబరిష్



**గూడూరు జూన్4( . :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అప్పరాజుపల్లి, పడమటి తండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పాల్గొన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, బాల్యవివాహాల నిర్మూలన, గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.రైతులు పంట మార్పిడి విధానం, సేంద్రియ ఎరువులు, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. వరి కొయ్యలను కాల్చకుండా ప్రత్యామ్నాయ వినియోగ మార్గాలను అనుసరించాలని చెప్పారు. స్వయం సహాయక బృందాలు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని, జనగణనలో ప్రతి ఒక్కరూ తమ వివరాలు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు, జనగణన నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు.

# తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టుకు అనిరుధ్ ఎంపిక




**హైదరాబాద్, జూన్ 4:().** తెలంగాణ రాష్ట్ర సీని యర్ వాటర్ పోలో జట్టుకు ఎల్. అనిరుధ్ ఎంపికయ్యారు. ఇటీవల అంబర్‌పేట్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన 11వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో జరిగిన ఎంపిక ట్రయల్స్ ఆధారంగా ఆయనను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు.అనిరుధ్ ఎంపికపై స్ట్రోక్స్ స్విమ్మింగ్ స్కూల్ యాజమాన్యం, కోచ్‌లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన జూలై 7 నుంచి 12 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్‌టీ కట్టాంకులతూర్‌లో నిర్వహిం చనున్న 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియ న్‌షిప్ (వాటర్ పోలో)లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు.

# పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

●హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష



**హనుమకొండ, జూన్ 4:(** పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మరింత వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచిం చారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఆర్‌డీఓలు మేన శ్రీను, నాగ పద్మజతో పాటు సంబంధిత శాఖల అధికారులతో పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు.ఇటీవల హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (చీణణదీ) అధికారులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, పరకాల మహిళా డెయిరీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆరు మండలాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు.డెయిరీ అభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డెయిరీ కార్యకలాపాల విస్తరణ, పాల సేకరణ కేంద్రాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన, సభ్యుల నమోదు తదితర అంశాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్య శారద డెయిరీ అభివృద్ధికి అవసరమైన అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టి, ప్రణాళికాబద్ధంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు రాధాకిషన్, బాలకృష్ణ, అడిషనల్ డీఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, డీపీఎంలు సరిత, వరలక్ష్మి, మెప్మా కోఆర్డినేటర్లు రజిత రాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం.. రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు

### మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, జూన్ 4( :** ప్రజలకు వేగవం తమైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభు త్వం రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచే ఆలోచన లేదని స్పష్టం చేశారు.

గచ్చిబౌలిలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పనులను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. భూముల విలువలను ప్రజలపై అదనపు భారం పడకుండా శాస్త్రీయ పద్ధతిలో సవరించామని చెప్పారు. భూముల విలువలపై అభ్యంతరాలు, సందేహాల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1800 599 4788, వాట్సాప్ నంబర్ 8247619983లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.రాష్ట్రంలో ఆధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నామని, తొలి దశలో 39 కార్యాలయాలను 13 క్లస్టర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. ఇప్పటికే నాలుగు భవనాలకు శంకుస్థాపన జరిగిందని, గచ్చిబౌలి భవనం ఈ ఏడాది డిసెంబర్ నాటికి అందుబాటులోకి వస్తుందని తెలిపారు.రెవెన్యూ శాఖలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి సుమారు 3,500 పెండింగ్ ఫైళ్లను పరిష్కరించినట్లు చెప్పారు. భూములకు సంబంధించిన అన్ని రికార్డులను డిజిటలైజ్ చేసే ప్రక్రియ చేపడుతున్నామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం తొలి విడత విజయవంతమైందని, నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని మంత్రి తెలిపారు.

# “ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక”లో భాగంగా వర్డ్ సభలు నిర్వహించడం జరిగింది

- రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై చర్చ
- పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ నేత్రం పోస్టర్లు విడుదల
- మున్సిపల్ కమిషనర్ పి.రాకేష్ రెడ్డి,తాండూర్ ఇంచార్జ్ డీఎస్పీ శ్రీనివాసులు,
- సీఐ పరమేశ్వర్ గౌడ్,కౌన్సిలర్ బి.అనిల్ కుమార్



**తాండూర్ మున్సిపల్, జూన్,04() :** వికా రాబాద్ జిల్లా తాండూర్ పట్టణ కేంద్రంలో గురువారం వార్డ్ సభలు నిర్వహించడం జరిగింది. ఈ వార్డ్ సభలో రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందు గ్రాగ్రత్తలపై కార్యాచరణ ప్రణాళిక పై చర్చించడం, వర్షపు నీరు మురుగు కాలువల పూడికతీత, మీరు నిలవకుండా నివారణ చర్యలు, తాగునీటి సరఫరా, జల్ సంచాయి – జల్ భగీరథి, ఘన వ్యర్థాల నిర్వహణ, ఓటర్ గాబితాలో ప్రత్యేక సవరణ, వర్షాకాలంలో మొక్కల పెంపకం, వంటి ఒకల అంశాలపై చర్చించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్షణ నేత్రం పోస్టర్లను విడుదల చేశారు. సీసీటీవీ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, కమిషనర్ పి. రాకేష్ రెడ్డి,సీఐ పరమేశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు బి. అనిల్ కుమార్,ఎం. ప్రత్యూష, నాగమణి, తాయాబ్ సుల్తానా, వార్డ్ ఆఫీసర్లు అనిల్ కుమార్, చంద్రశేఖర్, సాయి కృష్ణ, షఫీవుల, పోలీస్ శాఖ అధికారులు, అంగన్వాడి టీచర్లు,ఆర్పీలు, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయ్యండి

### మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి



**మల్కజ్ గిరి జూన్4(**

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు తక్షణమే అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కమిషనర్‌ను కలిసిన పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ కాలనీల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల వివరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా కాప్రా సర్కిల్ పరిధిలో రహదారులు, తాగునీటి సౌకర్యం, వర్షపు నీటి కాలువలు, కమ్యూనిటీ హాళ్లు వంటి మౌలిక సదుపాయాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో ఉండటంతో ప్రజలు రాకపోకల్లో తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని కాలనీల్లో ఖాళీ స్థలాలు ఉన్నప్పటికీ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కమ్యూనిటీ హాళ్లు లేవని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించి, వాటికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కమిషనర్‌ను కోరారు కాప్రా డివిజన్‌లో కృష్ణా నగర్, సింధూర్ కాలనీ, శ్రీ శివసాయి నగర్, లక్ష్మీ నగర్ ప్రాంతాల అంతర్గత లేన్లలో సీసీ రోడ్లు, సాకేట్ కాలనీ రోడ్ నెం.10, లేన్ నెం.16, 17లో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. అలాగే హనుమాన్‌పూర్ కాలనీ అంతర్గత లేన్లలో సీసీ రోడ్లు, నిర్మలా నగర్‌లో యునైటెడ్ చర్చి నుంచి సీడీఎంఏ కాంపౌండ్ వాల్ వరకు బీటీ రోడ్లు, గెలీలియో నగర్‌లో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మించాలని ప్రతిపాదించారు. ఏఎస్‌రావు నగర్ డివిజన్‌లో కమ్యూనిటీ హాల్ లేన్, భవానీ నగర్, మహేష్ నగర్, సౌత్ కమలా నగర్ రోడ్ నెం.1, 2, 3లో సీసీ రోడ్లు, జీఆర్ రెడ్డి నగర్, పోచారం టెంపుల్, శ్రీరంగార్ కాలనీ, న్యూ శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, పంచవటి కాలనీలో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణాన్ని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాజీవ్ నగర్‌లో హెచ్.నెం.3-5-24/70 వద్ద మరియు అంతర్గత లేన్లలో సీసీ రోడ్లు, అశోక్ నగర్‌లో మసీదు వద్ద మరియు అంతర్గత లేన్లలో సీసీ రోడ్లు, మంగాపురం కాలనీలో హెచ్‌వో వైభవ్ నిలయం వద్ద మరియు అంతర్గత లేన్లలో సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. చాణక్యపురి, బాబా నగర్, మల్లికార్జున నగర్, దత్తాత్రేయ నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, ఎస్‌వీ నగర్, భవానీ నగర్‌లో సీసీ రోడ్లు నిర్మించడంతో పాటు, చాణక్యపురి మరియు దత్తాత్రేయ నగర్‌లలో పార్కుల అభివృద్ధి చేపట్టాలని సూచించారు. అలాగే పితల్ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, గ్రీన్‌హిల్స్ కాలనీలో నాలాపై స్లాబ్ వేసి కవర్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాంరెడ్డి నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, సంస్కృతి హిల్స్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, భైకా సమాజం నుంచి వార్డు ఆఫీస్, కల్లు కాంపౌండ్ రోడ్ వరకు సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. అలాగే షాన్లీ గార్డెన్ నుంచి ఇందిరా నగర్ వరకు, ఇండస్ట్రియల్ లిమిట్స్ నుంచి అన్నపూర్ణ కాలనీ కమ్యూనిటీ హాల్ వరకు, సాయిబాబా టెంపుల్ నుంచి శివ నర్సింగ్ హోమ్ వరకు సీసీ రోడ్లు వేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాఘవేంద్ర నగర్‌లో గీన్సన్ గ్రామర్ స్కూల్ మెయిన్ గేట్ అంతర్గత లేన్లలో, హెచ్‌ఎంటీ నగర్‌లో స్ట్రీట్ నెం.2, 3, 11లో కూడా సీసీ రోడ్లు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాగీ శివమణి, అంజి రెడ్డి, హెచ్‌ఆర్ మోహన్, కాప్రా సాయి గౌడ్, విఠల్ నాయక్, ఉపేందర్ రెడ్డి, మహేష్ యాదవ్, నూతులకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గోశాలలో అగ్నిప్రమాదం



**రాయపోల్, జూన్ 5:** రాయపోల్ మండలంలోని రాంసాగర్ గోశాలలో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గోశాల సమీపంలోని విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగలడంతో ఏర్పడిన నిప్పు రవ్వలు గడ్డిపై పడటంతో మంటలు చెలరేగినట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు.మంటలు వేగంగా వ్యాపించడంతో గోశాలలో నిల్వ ఉంచిన గడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.20 వేల మేర నష్టం సంభవించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.అప్రమత్తమైన సిబ్బంది గోశాలలో ఉన్న ఆవులు, లేగదూడలను సురక్షితంగా బయటకు తరలించి రక్షించారు. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

# హైదరాబాద్‌లో టి-మొబైల్ గ్లోబల్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 4( .** అమెరికాకు చెందిన ప్రముఖ టెలికాం సంస్థ టి-మొబైల్ యూఎస్ఏ *(TMUS Global Solutions)* భారత ప్రవేశానికి హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుని తన గ్లోబల్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు 2.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కేంద్రంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, డెవ్‌ఓప్స్, ఉత్పత్తుల అభివృద్ధి, డేటా విశ్లేషణ, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు తదితర రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిగ్జ్ఞాన అభివృద్ధి చేపట్టనున్నారు. 2027 నాటికి హైదరాబాద్ కేంద్రంలో సుమారు 1,000 మంది ఉద్యోగులను నియమించనున్నట్లు సంస్థ ప్రకటించింది.మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణలో ప్రపంచ స్థాయి ప్రతిభ, అనుకూల పారిశ్రామిక వాతావరణం ఉండటంతో అంతర్జాతీయ సంస్థలు హైదరాబాద్‌ను ఎంపిక చేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 450కిపైగా గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు కార్యకలాపాలు నిర్వహిస్తూ 3 లక్షలకు పైగా నిపుణులకు ఉపాధి కల్పిస్తున్నాయని పేర్కొన్నారు.

# అగ్ని ప్రమాదాల నివారణలో ప్రభుత్వం విఫలం: తలసాని





**హైదరాబాద్, జూన్ 4( . :** అగ్ని ప్రమాదాల నివారణలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. గురువారం అమీర్‌పేట మైత్రివనం వద్ద అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఆయన సందర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో వరుస అగ్ని ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రమాదాల నివారణపై ప్రజలు, వాణిజ్య సముదాయాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని, అగ్నిమాపక శాఖకు ఆధునిక పరికరాలు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు తదితరులు ఉన్నారు.

# తిరుప్పరంకుండ్రం కొండ దీపం వ్యవహారం: ప్రభుత్వ వైఖరిపై హైకోర్టు ప్రశ్నలు

**మదురైజూన్4( . :** తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దీపస్తంభంలో దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో తమిళనాడు ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందేమిటని మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ప్రశ్నించింది.దీపం వెలిగింపునకు సంబంధించిన కోర్టు ఆదేశాలు అమలు కాలేదని ఆరోపిస్తూ దాఖలైన ధిక్కరణ పిటిషన్ నేపథ్యంలో ప్రభుత్వం అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్ విచారణ సందర్భంగా న్యాయమూర్తులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, భారతదేశం ప్రగాస్వామ్య దేశమని, ప్రజల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వ్యాఖ్యానించారు.ప్రభుత్వ తరపు న్యాయవాది స్పందిస్తూ, ఈ అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి వివరాలు సమర్పించేందుకు మరింత సమయం కావాలని కోరారు. దీనిని అంగీకరించిన ధర్మాసనం, జూన్ 22లోపు దీపం వెలిగింపు అంశంపై ప్రభుత్వ తుది వైఖరిని స్పష్టంగా తెలియగోయాలని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.

# జలమండలి కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది: హరీశ్ రావు

**హైదరాబాద్, జూన్ 4(** జలమండలి ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్ రావు విమర్శించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్-ఎస్‌బీ గేట్ వద్ద నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఎల్లుండి జరిగే యూనియన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ యూనియన్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గుర్తు మార్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, ఏ గుర్తు ఉన్నా గెలిచేది కార్మికుల మద్దతేనని అన్నారు.ప్రగా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వంచిస్తోందని, రెండున్నరేళ్లు గడిచినా ఉద్యోగులకు పీఆర్సీ, పెండింగ్ డీఏలపై స్పష్టత ఇవ్వలేదని విమర్శించారు. ఆశా, అంగన్‌వాడీ, ఆర్టీసీ, జీహెచ్‌ఎంసీ, సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు కూడా నెరవేర్చలేదన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జలమండలిలో 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, వందల మందికి పదోన్నతులు కల్పించామని గుర్తుచేశారు. ప్రస్తుతం జలమండలి పరిధి విస్తరించినప్పటికీ కొత్త నియామకాలు లేక కార్మికులపై పనిభారం పెరిగిందన్నారు.పటాన్‌చెరులోని సిగాచి పరిశ్రమ ప్రమాద బాధితులకు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా ఇప్పటికీ అందలేదని ఆరోపించిన హరీశ్ రావు, కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటే రాంబాబును గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

# పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై బీసీ సంఘాల ఆగ్రహం

**హైదరాబాద్ జూన్4(**

బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో బీసీ పొలిటికల్ ఫ్రంట్, బీసీ ఇంటలెక్చ్యువల్ ఫోరమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జనసేన అధినేతఖుఖుఖుఅ ఖుశ్రీఖుఅ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.బీసీ ఇంటలెక్చ్యువల్ ఫోరమ్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ తెలంగాణ భాష, యాస, సంస్కృతిని అవమానించేలా పవన్ కళ్యాణ్ మాట్లాడారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకు ఆంధ్ర ప్రజలపై ఎలాంటి విద్వేషం లేదని, అయితే తమ పాలన, స్వాభిమానాన్ని కాపాడుకునేందుకే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు.బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తెలంగాణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బీసీల రాజకీయ సాధికారతను అడ్డుకునేందుకే ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాధాన్యం లభించలేదని, రానున్న కాలం బహుజనులదేనని పేర్కొన్నారు. 2028 నాటికి బహుజన రాజ్య స్థాపన లక్ష్యంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.సమావేశంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై తమ నిరసన వ్యక్తం చేశారు.

# జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చితీరుతాం: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, జూన్ 4(.** జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపుపై ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టుల ఇంటి స్థలాల విషయంలో తాను, ముఖ్యమంత్రి ఒకే అభిప్రాయంతో ఉన్నామని తెలిపారు.కేబినెట్ సబ్ కమిటీ ఇంకా తుది తీర్మానం చేయకపోవడంతోనే ముఖ్యమంత్రి అధికారిక ప్రకటన చేయలేదని ఆయన పేర్కొన్నారు.ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టును రద్దు చేసే అవకాశం లేదని, అక్కడ భూములను ఉచితంగా ఇవ్వడం లేద ని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు రద్దు చేస్తే ప్రభుత్వం ఇప్పటికే వచ్చిన నిధులను తిరిగి చెల్లించాల్సి వస్తుందని, అది సాధ్యపడదన్నారు.ఫ్యూచర్ సిటీ అంశంపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రజలు నమ్మవద్దని మంత్రి పొంగులేటి సూచించారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం ముందుకు తీసుకెళ్తోందని అన్నారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధిపై ఎంఎంసీ కమిషనర్‌తో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ



**మల్కాజ్ గిరి కార్పొరేషన్ జూన్4(**

గ్రామకంతం భూమిలో 11 గుంటల స్థలాన్ని ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కెటాయించ ండి మల్కాజ్‌గిరి, వెలుగుమల్కాజ్‌గిరి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, తో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. సమావేశంలో అల్వాల్ ఫైర్ స్టేషన్ నిర్మాణ అంశాన్ని ఎమ్మెల్యే ప్రధానంగా ప్రస్తావించారు. అల్వాల్ గ్రామకంతం భూమిలో 11 గుంటల స్థలాన్ని ఫైర్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించే విషయమై ఎమ్మార్వో డిప్యూటీ కమిషనర్‌కు పంపిన లేఖలు, అలాగే జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదించిన తీర్మాన పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. ఫైర్ స్టేషన్ నిర్మాణంపై నెలకొన్న అపోహలను తొలగించి, అల్వాల్ ప్రాంత ప్రజల భద్రత దృష్ట్యా పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా చాణిక్యపురి పార్క్ అభివృద్ధి, నియోజకవర్గంలోని పార్కుల ఆధునీకరణ, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, బండ చెరువు అభివృద్ధి, చెరువులకు సంబంధించిన కోర్టు వ్యవహారాలు పరిష్కరించుకుని అభివృద్ధి పనులు చేపట్టడం వంటి అంశాలను కూడా ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వివిధ కాలనీల్లో అవసరమైన బాక్స్ డ్రెన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, అలాగే ఆర్కేఎచ్ కాలనీలో పార్కు స్థల పరిరక్షణ అంశాలపై కూడా వినతిపత్రాలు సమర్పించారు. ఎమ్మెల్యే సూచించిన అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, ఇంజనీరింగ్ ప్రాజెక్టు అధికారులు, మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, ప్రభాకర్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, ప్రశాంత్ రెడ్డి, సంతోష్ గుప్తా, మల్లేష్ యాదవ్, హనుమాన్ చారి, ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు & ఆయాల నియామక ప్రకటన

దరఖాస్తుల సమర్పణ విధానం

**కొడంగల్ మున్సిపల్,(మం)జూన్,04(** కొడంగల్ మండలంలోని ఎంపిక చేసిన 7 ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్న ప్రీ-ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు (×అర్‌తీబష్‌శీతీం) మరియు ఆయాల (ూఖుం) పోస్టుల దరఖాస్తు సమ-ర్పణ విధానాన్ని మండల విద్యాధికారి (వీజూూ) స్పష్టం చేశారు.దరఖాస్తు సమర్పించవలసిన విధానం (ూజూజూశ్రీఙ్‌అశీఅ ాబఎఎంంఅశీఅ ాతీశీఎవం):అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను నేరుగా కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు పంపరాదు.అభ్యర్థులు తమ పూర్తి వివరాలు మరియు అవసరమైన ధృవీకరణ పత్రాల నకళ్లతో కూడిన దరఖాస్తును మొదట సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయునికి 08-06-2026లోపు (జశీఅఙతీఅవ ూష్ట్రశీశ్రీ ఎవీ) సమర్పించాలి.పాఠశాల ప్రధానోపాధ్యాయులు (ూష్ట్రశీశ్రీ ఎవీ) ఆ దరఖాస్తులను పరిశీలించి, వాటిని సంబంధిత కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు (జశీఎజూశ్రీవఞ ఎవీం) సమర్పిస్తారు .ముఖ్యమైన గడువు (=వజఅంవ ఞుర్ ఞవ):పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు దరఖాస్తులు చేరడానికి ఆఖరి తేదీ: 09.06.2026.

ఖాళీలు ఉన్న పాఠశాలల వివరాలు: 1 జి.సి.పి.ఎస్ (గర్ల్స్), కొడంగల్
2 ఎం.పి.యు..పి.ఎస్ (గర్ల్స్), హస్నాబాద్
3 ఎం.పి.పి.ఎస్, రావులపలి
4 ఎం.పి.పి.ఎస్, అన్నారం
5 ఎం.పి.యు.పి.ఎస్, కస్తూరిపల్లి
6 ఎం.పి.పి.ఎస్, అంగడిరైచూర్
7 ఎం.పి.పి.ఎస్, పెద్ద నందిగామ

అర్హత మరియు పత్రాల వివరాలు:ఇన్‌స్ట్రక్టర్ (మహిళా): ఇంటర్మీడియట్ ం డి.ఎడ్ (఑.జుu). స్థానిక నివాసి అయి ఉండాలి.(జతపరచవలసినవి: ూూజ, ఇంటర్, డి.ఎడ్ మెమోలు, తాజా లోకల్ ఏరియా సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్ నకలు). ఆయా (మహిళా): కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత. స్థానిక నివాసి అయి ఉండాలి. (జతపరచవలసినవి: 7వ తరగతి పాస్ పత్రం, తాజా లోకల్ ఏరియా సర్టిఫికేట్, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్ నకలు).వయోపరిమితి సడలింపు:ూజ, ూ, దీజ, జుదీజ అభ్యర్థులకు: 5 సంవత్సరాలు మాజీ సైనికోద్యోగులకు: 3 సంవత్సరాలు దివ్యాంగులకు (ూఇజ): 10 సంవత్సరాలుఅభ్యర్థులు ఈ మార్పును గమనించి నిర్ణీత గడువు లోగా సంబంధిత పాఠశాల హెచ్‌ఎంల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరడమైనది..మండల విద్యాధికారి(ఎంఇఓ), కొడంగల్

# చెరువును మింగేస్తున్నారు

- మల్కాజ్‌గిరి 'బండ చెరువు' ఎఫ్‌టీఎల్ పరిధిలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- కనుచూపు మేరలో లేని 'హైడ్రా'.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న మున్సిపల్ అధికారులు

**మల్కాజ్‌గిరి,జూన్4( :** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 'బండ చెరువు' (మిర్యాల గూడ చెరువు) ఆక్రమణదారుల చేతుల్లో నలిగిపోతోంది. చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్ జోన్లలో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆక్రమణలను అడ్డుకోవాల్సిన స్థానిక మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమార్కుల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. చెరువుల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' నిఘా ఇటువైపు లేకపోవడంతో భూబకాసురులు పోటీపడి మరీ బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు.

**95 ఎకరాల విస్తీర్ణం.. 10 ఎకరాలకు కుదింపు**

వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని ఈ బండ చెరువు రోజురోజుకూ తన ఉనికిని కోల్పోతోంది. గతంలో ఈ చెరువు దాదాపు 95 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, 35 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తూ 605 మీటర్ల పొడవైన కట్టను కలిగి ఉండేదని స్థానికులు గుర్తుచేస్తున్నారు. అయితే నేడు ఆక్రమణల కారణంగా కనీసం 10 ఎకరాలు కూడా మిగల్లేదని వారు ఆరోపిస్తున్నారు. రాత్రికి రాత్రే చెరువు గర్భంలో మట్టి, శిథిలాలు పోసి పూడ్చేస్తూ చెరువు ఆనవాళ్లనే చెరిపేస్తున్నారని మండిపడుతున్నారు.

**పెద్దలకు ఒక రూలు.. పేదలకు ఒక రూలా?**

స్థానిక అధికారులు పేదవారు ఇళ్లు నిర్మించుకుంటే చట్టాలు, నోటీసులు అంటూ హడావుడి చేస్తారని, అదే భారీగా మామూళ్లు చెల్లిస్తూ చెరువును ఆక్రమిస్తున్న పెద్దల విషయంలో మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. అధికారులను కాకా పట్టి చెరువును మింగేస్తున్న వారి అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

**కంపెక్కిన చెరువు.. కాలనీవాసుల నరకయాతన**

ఒకవైపు ఆక్రమణలు చెరువును మింగేస్తుంటే, మరోవైపు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి తెచ్చి పోస్తున్న చెత్తాచెదారం, భవన నిర్మాణ వ్యర్థాలతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. మున్సిపల్ సిబ్బంది ఈ వ్యర్థాలను తొలగించకపోవడంతో చెరువు నీరు మురుగునీటిగా మారి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దుర్వాసనతో పాటు దోమల బెడద కారణంగా స్థానికులు శ్వాసకోశ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటూ, పలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇకనైనా చర్యలు తీసుకుంటారా?**

కాగితాలకే పరిమితమవుతున్న నిబంధనలను పక్కనపెట్టి ఉన్నతాధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా 'హైడ్రా' అధికారులు స్పందించి, ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ కట్టడాలను తొలగించి బండ చెరువును పరిరక్షించాలని మల్కాజ్‌గిరి ప్రజలు కోరుతున్నారు.

# నాలా బాధితులను అదుకోండి

- బాధితులతో కలిసి ఎంఎంసీ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ ఇంచార్జ్



**మల్కాజ్ గిరిజూన్4( ) :** ఉప్పల్‌లోని కావేరి నగర్ నుంచి నల్ల చెరువు వరకు నాలాకు ఇరువైపులా రిటర్నింగ్ వాల్ నిర్మాణం కోసం స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్లాన్ (ఎస్ఎన్‌డీపీ) కింద రూ.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనుల్లో భాగంగా కావేరి నగర్, న్యూ భారత్ నగర్, హనుమాన్ నగర్, సౌత్ స్వరూప్ నగర్ తదితర కాలనీల నివాసితులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారని అయితే నాలా బాధితులను అదోకోవాలని కోరుతు గురువారం బాధితులతో కలిసి ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిశారు ఈ సందర్బంగా అయన మాట్లాడుతు నాలా విస్తరణ పనుల నేపథ్యంలో ఇళ్లకు ముప్పు వాటిల్లుతుందన్న ఆందోళనలో ఉన్న బాధితులకు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి అండగా నిలిచారు. . ఎస్ఎన్‌డీపీ పనుల కారణంగా ఏ ఒక్కరికీ నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు. బాధితులతో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. నాచారం పెద్ద చెరువు నుంచి ఉప్పల్ నల్ల చెరువు వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టనున్నట్లు, ఈ పనుల ప్రభావంతో కొన్ని ఆస్తులు ప్రభావితమయ్యే అవకాశం ఉందని నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా, ఎవరి ఆస్తి కోల్పోకుండా తగిన చర్యలు తీసుకుంటాం" అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్, కావేరి నగర్, నార్త్ స్వరూప్ నగర్, సౌత్ స్వరూప్ నగర్, న్యూ భారత్ నగర్ కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బడిబాటను ఉద్యమంలా చేపట్టాలి




**కరీం నగర్ జూన్4(:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని అదనపు కలెక్టర్ డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పాఠశాల వయస్సు గల ప్రతి బాలబాలికను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా విద్యాశాఖతో పాటు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బడిబయట ఉన్న పిల్లలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేందుకు ప్రత్యేక ప్రచారం చేపట్టాలన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాలపై గ్రామాలు, కాలనీలు, తండాలు, గిరిజన ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. ఐదేళ్లు నిండిన పిల్లలను మొదటి తరగతిలో చేర్పించడంతో పాటు, 5 నుంచి 6, 7 నుంచి 8, పదో తరగతి అనంతర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పరిశుభ్రత, తాగునీరు, పచ్చదనం, ఆకర్షణీయ వాతావరణంతో సిద్ధం చేయాలని, మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు ప్రత్యేక్ష తం రూపొందించాలని తెలిపారు.సమావేశంలో డీఈవో ప్రశాంత్ రెడ్డి, డీపీవో జగదీశ్వర్, డీఆర్డీవో్ష త, జెడ్పీ సీఈవో పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలులో జాప్యం.. రహదారిపై అన్నదాతలు



**రాయపోల్, జూన్ 5:**

ధాన్యం కొనుగోలు, తరలింపులో జాప్యం చోటుచేసుకోవడంతో అంకిరెడ్డిపల్లి, వీరనగర్ గ్రామాల రైతులు గురువారం గజ్వేల్--చేగుంట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయినా ప్రభుత్వం సకాలంలో లారీలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, అయినప్పటికీ కొనుగోలు ప్రక్రియలో వేగం కనిపించడం లేదని రైతులు ఆరోపించారు. లారీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోవడంతో తమ ఆందోళనను వ్యక్తం చేస్తూ రహదారిపై బైఠాయించారు.

సమాచారం అందుకున్న రాయపోల్ ఎస్ఐ మానస సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తొగుట సీఐ లతీఫ్ అక్కడికి చేరుకుని గురువారం సాయంత్రంలోగా ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు లారీలు పంపించి ధాన్యం తరలింపు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.రాస్తారోకో కారణంగా కొంతసేపు గజ్వేల్--చేగుంట రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నదాతలు డిమాండ్ చేశారు.



# జిగురుగా ఉంటాయని చామ దుంపలను తినడం లేదా..?

## అయితే అనేక లాభాలను మీరు కోల్పోయినట్లే..!

మార్కెట్‌లో మనకు అనేక రకాల దుంపలు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో చామ దుంపలు కూడా ఒకటి. ఇవి జిగురుగా ఉంటాయి. కనుక చాలా మంది వీటిని తినేందుకు అంతగా ఇష్టపడరు. కానీ చామదుంపలతో పులుసు, టమాటా కర్రీ చేస్తే ఎంతో రుచిగా ఉంటాయి. చాలా మంది ఈ కూరలను ఇష్టంగా తింటారు. అయితే వాస్తవానికి చామ దుంపలు ఇతర దుంపల కన్నా భిన్నమైనవి. ఇవి అనేక పోషకాలను కలిగి ఉంటాయి. మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. చామ దుంపలను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. ఈ దుంపలను తినడం వల్ల ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు తరచూ ఈ దుంపలను తింటుంటే ఫలితం ఉంటుంది.

**షుగర్ లెవల్స్ తగ్గేందుకు..**

చామ దుంపల్లో రెసిస్టెంట్ స్టార్చ్ అధికంగా ఉంటుంది. అందువల్ల ఇది ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. కనుక ఈ దుంపలను తింటుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది. అలాగే రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అనారోగ్య సమస్యలు రాకుండా చూస్తుంది. చామ దుంపలలో ఫైబర్, రెసిస్టెంట్ స్టార్చ్ అధికంగా ఉంటాయి. కనుక ఈ దుంపలు ఇతర దుంపల్లాగా షుగర్ లెవల్స్‌ను పెంచవు. ఈ దుంపల గ్లైసీమిక్ ఇండెక్స్ విలువ కూడా తక్కువగా ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఎలాంటి భయం లేకుండా ఈ దుంపలను తినవచ్చు. పైగా ఈ దుంపల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు దోహదం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది.

**హైబీపీ ఉన్నవారికి..**

చామ దుంపల్లో పొటాషియం అధిక మెుత్తంలో ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీని వల్ల రక్త నాళాలు వెడల్పుగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఈ దుంపలను తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్తనాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. దీంతో హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. ఈ దుంపల్లో ఉండే సంక్లిష్టమైన పిండి పదార్థాల కారణంగా వీటిని తింటే శరీరానికి శక్తి నిరంతరం లభిస్తూనే ఉంటుంది. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్దకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి.

**బరువు తగ్గేందుకు..**

అధిక బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ దుంపలు మేలు చేస్తాయి. సాధారణంగా దుంపలు అంటే బరువు పెంచుతాయి అని అనుకుంటారు. కానీ చామ దుంపలు మాత్రం బరువును తగ్గిస్తాయి. ఈ దుంపల్లో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గడం తేలికవుతుంది. కనుక బరువు తగ్గాలనుకునే వారు తరచూ చామ దుంపలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. ఇక ఈ దుంపల్లో అనేక పోషకాలు ఉంటాయి. వీటిల్లో అధికంగా ఉండే విటమిన్ ఇ యాంటీ ఆక్సిడెంట్‌లా పనిచేస్తుంది. చర్మ కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీని వల్ల చర్మంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే ఈ దుంపల్లో అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు, రోగాలు రాకుండా ఉండేందుకు సహాయం చేస్తాయి. ఇలా చామ దుంపలను తరచూ తింటుండడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# రోజూ 15 నిమిషాల పాటు నవ్వితే..



## ఎన్ని అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయో తెలుసా..?

ప్రస్తుత ఆధునిక యుగంలో సగటు మనిషి నిత్యం అనేక ఒత్తిళ్లకు గురవుతున్నాడు. నిత్యం ఉదయం నిద్ర లేచిన దగ్గర్నుంచి రాత్రి మళ్లీ నిద్రించే వరకు అనేక రకాలుగా వివిధ రకాల సమస్యలతో సతమతం అవుతున్నాడు. ప్రస్తుతం సగటు మనిషి యాంత్రిక జీవితాన్ని గడుపుతున్నాడు. దీనికి తోడు ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దీని వల్ల అనేక రోగాల బారిన పడుతున్నారు. అయితే ఈ సమస్యలన్నింటికీ ఒకే ఒక్కటి ఔషధంగా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. అదే.. నవ్వు. నవ్వడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు. నవ్వు మన ఆరోగ్యానికి అనేక లాభాలను అందిస్తుందని వారు చెబుతున్నారు. రోజూ కనీసం 15 నిమిషాల పాటు మనస్ఫూర్తిగా ప్రశాంతంగా నవ్వ గలిగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వారు అంటున్నారు.

**డయాబెటిస్ ఉన్నవారికి..**

నవ్వడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. రోజూ కనీసం 15 నిమిషాల పాటు మనస్ఫూర్తిగా ప్రశాంతంగా నవ్వాల్సి ఉంటుంది. మీకు ఖాళీ ఉన్న సమయాన్ని ఎంచుకుని ఆ సమయంలో నవ్వవచ్చు. నవ్వేందుకు మీరు కామెడీ సీన్లు చూడవచ్చు. లేదా జోకులను చదవవచ్చు. లేదా పుస్తకాలను కూడా చదవ వచ్చు. ఎలాగైనా సరే నవ్వాల్సి ఉంటుంది. ఇలా చేస్తే 2 గంటల పాటు నిద్రించినంత లాభం కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. నవ్వడం వల్ల టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అయితే షుగర్‌కు దీనికి సంబంధం ఏమిటని చాలా మంది అనుకోవచ్చు. కానీ సంబంధం ఉంటుంది. అదేమిటంటే.. చాలా మందికి ఒత్తిడి వల్ల కూడా టైప్ 2 డయాబెటిస్ వస్తుంది. అలాంటి వారు నవ్వడం వల్ల ఒత్తిడిని క్రమంగా తగ్గించుకోవచ్చు. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. ఇలా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి నవ్వు మేలు చేస్తుంది.

**గుండె ఆరోగ్యానికి..**

నవ్వడం వల్ల రక్త నాళాలు వెడల్పుగా మారి ప్రశాంతంగా ఉంటాయి. రక్త నాళాల వాపులు తగ్గుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా హార్ట్ ఎటాక్ రాకుండా అడ్డుకోవచ్చు. నవ్వడం వల్ల ముఖంలో చర్మానికి రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో పోషకాలు లభిస్తాయి. ఫలితంగా చర్మానికి తేమ లభించి కాంతివంతంగా, మృదువుగా మారుతుంది. అలాగే ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. దీంతో యవ్వనంగా కనిపిస్తారు. కనుక నవ్వు అనేది మనల్ని నిరంతరం యవ్వనంగా కనిపించేలా చేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండాలి.

**నిద్రలేమి సమస్యకు..**

మనలో చాలా మంది నిత్యం అనేక సందర్భాల్లో వివిధ రకాల ఒత్తిళ్లకు గురవుతుంటారు. దీని కారణంగా చాలా మంది మద్యం, పొగ తాగడం వంటి చెడు వ్యసనాలకు బానిసలు అవుతారు. అయితే వాటి జోలికి వెళ్లకుండా నవ్వడం అలవాటు చేసుకుంటే చాలు, ఎంతో మేలు జరుగుతుంది. కనీసం రోజూ 15 నిమిషాల పాటు నవ్వితే అలాంటి వ్యసనాల జోలికి వెళ్లరు. పైగా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. డిప్రెషన్ నుంచి బయట పడతారు. మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. రాత్రి పూట మైండ్ రిలాక్స్ అవుతుంది. దీని వల్ల నిద్ర చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. నవ్వడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుందని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. నవ్వడం వల్ల శరీరంలో యాంటీ బాడీల సంఖ్య పెరుగుతుంది. దీని వల్ల రోగకారక క్రిములు నశిస్తాయి. వ్యాధులు, ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుంది. అలాగే నవ్వడం అనేది సహజసిద్ధమైన పెయిన్ కిల్లర్‌గా కూడా పనిచేస్తుంది. శరీరంలోని అనేక రకాల నొప్పులు సైతం తగ్గిపోతాయి. ఇలా రోజూ 15 నిమిషాల పాటు నవ్వడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



# మూత్రంలో మంటగా ఉంటూ ఇబ్బంది పడుతున్నారా..?

## అయితే ఈ చిట్కాలను పాటించండి..!

మన శరీరంలో ఎప్పటికప్పుడు ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మన శరీరం మూత్రం ద్వారా బయటకు పంపిస్తుంది. ఇందుకు గాను కిడ్నీలు నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటాయి. మనం శరీరంలోని వ్యర్థాలను వడబోసి కిడ్నీలు మూత్రాన్ని ఉత్పత్తి చేస్తాయి. అనంతరం ఆ మూత్రం మూత్రాశయంలో నిల్వ ఉండి తరువాత బయటకు వస్తుంది. అయితే మూత్ర విసర్జన ప్రక్రియలో కొందరికి మూత్రం మంటగా వస్తుంది. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. పులుపు, కారం, మసాలాలు ఉండే ఆహారాలను అతిగా తినే వారికి సహజంగానే మూత్రం మండినట్లు వస్తుంది. అలాగే మూత్రంలో ఆమ్లత్వం పెరిగినా, నీళ్లను సరిగ్గా తాగకపోయినా, మద్యం అతిగా సేవించినా, వేడి వాతావరణంలో ఎక్కువ సేపు ఉన్నా మూత్రంలో మంటగా అనిపిస్తుంది. అయితే నీళ్లను ఎక్కువగా తాగితే ఈ సమస్య దానంతట అదే తగ్గుతుంది. కానీ అలా తగ్గకపోతే పలు ఇంటి చిట్కాలను పాటించాలి. అలాగే పలు ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది.



**ఈ చిట్కాలను పాటించండి..**

మూత్రంలో మంట ఉన్నవారు బార్లీ జావను తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. బార్లీ గింజలను నీటిలో వేసి మరిగించి అనంతరం ఆ నీళ్లను వడకట్టి అందులో కొద్దిగా తేనె, నిమ్మరసం కలిపి తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. కొబ్బరినీళ్లు కూడా ఈ సమస్యను తగ్గించగలవు. పూటకు 200 ఎంఎల మోతాదులో కొబ్బరినీళ్లను తాగుతుంటే మూత్రంలో మంట తగ్గిపోతుంది. పలుచని మజ్జిగను పూటకు ఒక గ్లాస్ చొప్పున తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఉసిరికాయల రసాన్ని పూటకు 30 ఎంఎల్ మోతాదులో ఒక గ్లాస్ నీటిలో కలిపి తాగుతున్నా కూడా సమస్య తగ్గుతుంది. ఈ చిట్కాలను పాటిస్తుంటే మూత్రంలో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు.

**ఈ ఆహారాలను కూడా తీసుకోవాలి..**

మూత్రంలో మంట తగ్గేందుకు పలు ఆహారాలు కూడా మేలు చేస్తాయి. పాలకూరను జ్యూస్ గా చేసుకుని రోజుకు 2 సార్లు ఒక కప్పు మోతాదులో తాగాలి. అలాగే పూటకు ఒక కీరదోసను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పూటకు ఒక అరటి పండు కూడా ఈ సమస్యను తగ్గిస్తుంది. అలాగే పుచ్చకాయలు, తర్బూజాలను తింటున్నా కూడా ఫలితం ఉంటుంది. ఈ విధంగా ఆయా ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. అయితే కేవలం మూత్రంలో మంట మాత్రమే ఉండి, ఇతర ఏ అనారోగ్య సమస్యలు లేకపోతే పైన తెలిపిన చిట్కాలు, తీసుకోవాల్సిన ఆహారాలు పనిచేస్తాయి. కానీ ఇతర అనారోగ్య సమస్యలు లేదా వ్యాధులు ఉంటే మాత్రం కచ్చితంగా డాక్టర్ సలహా మేరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే సమస్య నుంచి బయట పడేందుకు అవకాశాలు ఉంటాయి.

**ఈ సమస్యలు కూడా ఉంటే..**

మూత్ర విసర్జన చేసే సమయంలో మూత్రంలో మంటతోపాటు చీము వస్తుంటే ఇన్ఫెక్షన్ వచ్చిందని గుర్తించాలి. అలాంటప్పుడు డాక్టర్‌చే చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే మూత్రంలో మంటతోపాటు వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే కిడ్నీ స్టోన్లు ఉన్నాయని లేదా మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు ఉన్నాయని అర్థం చేసుకోవాలి. ఇలాంటి పరిస్థితిలో కూడా డాక్టర్‌చే చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే మూత్రంలో దుర్వాసన వస్తున్నా, పదే పదే మూత్ర విసర్జన చేయాల్సి వస్తున్నా, మూత్రం బొట్లు బొట్లుగా లీక్ అవుతున్నా, మూత్రం సరిగ్గా రాకపోయినా కూడా డాక్టర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. కొన్ని రకాల ఆహారాలు కూడా మూత్రంలో మంట వచ్చేందుకు కారణం అవుతాయి. శీతల పానీయాలు, మద్యం, టీ, కాఫీ వంటి వాటిని తీసుకోవడం తగ్గించాలి. లేదా కొంతకాలంపాటు మానేయాలి. ఈ విధంగా జాగ్రత్తలను పాటిస్తూ సరైన సమయంలో చికిత్స తీసుకుంటే మూత్రంలో మంట సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు.

చురకలు





## తగ్గిన బంగారం, వెండి ధరలు

**హైదరాబాద్, జూన్ 4 :** పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించే విధంగా బంగారం ధరలు వరుసగా తగ్గుముఖం పట్టాయి. గత వారం రోజులుగా బంగారం ధరల్లో స్వల్ప తగ్గుదల కొనసాగుతుండగా, గురువారం కూడా ధరలు తగ్గాయి. దీంతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఉపశమనం లభించింది. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం, 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ.110, 22 క్యారెట్ల బంగారంపై రూ.100, 18 క్యారెట్ల బంగారంపై రూ.90 మేర ధర తగ్గింది. ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ.1,56,110గా నమోదైంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,100గా, 18 క్యారెట్ల బంగారం ధర రూ.1,17,080గా కొనసాగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర ఒకే స్థాయిలో కొనసాగుతోంది. హైదరాబాద్, అమరావతి, విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, అనంతపురం, వరంగల్, ఖమ్మం, కడప నగరాల్లో 10 గ్రాముల బంగారం ధర రూ.1,56,110గా ఉంది. ఇక వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. 100 గ్రాముల వెండిపై రూ.500, కిలో వెండిపై రూ.5,000 మేర తగ్గుదల నమోదైంది. హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి ధర రూ.28,500గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,85,000గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పులు, డాలర్ మారకపు విలువ, పెట్టుబడిదారుల కొనుగోలు ధోరణి వంటి అంశాల ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ధరలు తగ్గుముఖం పట్టడంతో కొనుగోలుదారులు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## ఏఐ మోసాలకు గూగుల్ కొత్త అడ్డుకట్ట

**హైదరాబాద్, జూన్ 4 :** కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించి ఇతరుల గొంతును అనుకరిస్తూ జరుగుతున్న సైబర్ మోసాలను అరికట్టేందుకు గూగుల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారుల భద్రత కోసం 'నకిలీ కాల్ గుర్తింపు' అనే కొత్త భద్రతా సదుపాయాన్ని ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ ఫీచర్ ద్వారా కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ మోసాల నుంచి వినియోగదారులు మరింత సురక్షితంగా ఉండే అవకాశం ఉంది. ఈ సదుపాయం ప్రత్యక్ష కాల్‌ల సమయంలో నేపథ్యంలో పనిచేస్తూ అనుమానాస్పద కాల్‌లను గుర్తిస్తుంది. వినియోగదారుడి ఫోన్‌లో భద్రపరిచిన నంబర్ నుంచి వచ్చిన కాల్ నిజంగా ఆ వ్యక్తిదేనా లేదా అనే విషయాన్ని ప్రత్యేక సాంకేతిక విధానాల ద్వారా తనిఖీ చేస్తుంది. సందేశాల ఆధారిత ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థ సహాయంతో నిశ్శబ్ద సంకేతాలను పంపి కాల్ ప్రామాణికతను నిర్ధారిస్తుంది. సైబర్ నేరగాళ్లు కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల నంబర్లను నకిలీగా ఉపయోగించి, కృత్రిమ మేధ సాయంతో వారి గొంతును అనుకరించి మాట్లాడే సందర్భాల్లో కూడా ఈ ఫీచర్ హెచ్చరికలు జారీ చేస్తుంది. కాల్ అనుమానాస్పదంగా ఉన్నట్లు గుర్తిస్తే, అది సంబంధిత వ్యక్తి నుంచి వచ్చిన కాల్ కాకపోవచ్చని తెరపై సందేశం చూపిస్తుంది. అంతేకాకుండా కాల్‌ను వెంటనే నిలిపివేసే అవకాశాన్ని కూడా అందిస్తుంది. ఇటీవలి కాలంలో కృత్రిమ మేధ ఆధారిత వాయిస్ మోసాలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా పెరుగుతున్నాయి. కుటుంబ సభ్యులు ప్రమాదంలో ఉన్నారని, అత్యవసరంగా డబ్బు పంపాలని చెప్పి ప్రజలను మోసం చేసే ఘటనలు అధికమయ్యాయి. ఈ తరహా మోసాల వల్ల ప్రతి ఏడాది భారీ స్థాయిలో ఆర్థిక నష్టాలు సంభవిస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ కొత్త భద్రతా సదుపాయం సక్రమంగా పనిచేయాలంటే కాల్ చేసే వ్యక్తి, కాల్ స్వీకరించే వ్యక్తి ఇద్దరి మొబైల్‌లలోనూ గూగుల్ ఫోన్, సందేశాలు, పరిచయాల అనువర్తనాలు ప్రధాన అనువర్తనాలుగా అమర్చబడి ఉండాలి. ఆండ్రాయిడ్ 12 లేదా అంతకంటే పై వెర్షన్ కలిగిన స్మార్ట్‌ఫోన్లలో ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుంది. మొదట గూగుల్ పిక్సెల్ స్మార్ట్‌ఫోన్లలో ప్రారంభమైన ఈ సదుపాయం, ఈ నెల నుంచి ఇతర ఆండ్రాయిడ్ బ్రాండ్ల ఫోన్లలో కూడా దశలవారీగా అందుబాటులోకి రానుంది. వినియోగదారుల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా గూగుల్ తీసుకొచ్చిన ఈ కొత్త ఫీచర్‌కు సాంకేతిక రంగ నిపుణులు స్వాగతం పలుకుతున్నారు.




# మద్యం ధరల పెంపు దిశగా కసరత్తు



**హైదరాబాద్, జూన్ 4 :** తెలంగాణలో మద్యం ధరల పెంపు అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మద్యం తయారీ వ్యయం గణనీయంగా పెరిగిందని పేర్కొంటూ, కొనుగోలు ధరలను కనీసం పది శాతం పెంచాలని తయారీ సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. మద్యం ధరల పెంపుపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించేందుకు కమిటీ ఇప్పటికే తయారీ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తోంది. ఒకవైపు సంస్థల ఆర్థిక ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటూనే, మరోవైపు రాష్ట్ర ఆదాయంపై ప్రభావం పడకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ధరలు పెరిగితే ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమ మద్యం రవాణా పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన అధికారుల్లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి సరిహద్దు జిల్లాల్లో తక్కువ ధరల కోసం పొరుగు రాష్ట్రం వైపు వినియోగదారులు మొగ్గు చూపే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇలా జరిగితే తెలంగాణకు వచ్చే ఎక్సైజ్ ఆదాయం తగ్గే ప్రమాదం ఉంది. ఇప్పటికే సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కట్టుదిట్టం చేసినప్పటికీ, రెండు రాష్ట్రాల మధ్య ధరల్లో పెద్ద వ్యత్యాసం ఉంటే అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడం సవాలుగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు. అందుకే రెండు రాష్ట్రాల ధరల మధ్య సమతుల్యతను కాపాడే విధంగా నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సమావేశంలో ముడి పదార్థాల ధరలు, రవాణా వ్యయాలు గణనీయంగా పెరిగాయని తయారీ సంస్థలు కమిటీ దృష్టికి తీసుకెళ్లాయి. ప్రస్తుత ధరలతో వ్యాపారం కొనసాగించడం కష్టంగా మారిందని అవి వివరించాయి. కమిటీ ఈ వాదనలను పరిశీలించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను కూడా సమీక్షిస్తోంది. రాబోయే మూడు రోజుల్లో కమిటీ తన అధ్యయనాన్ని పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఆ నివేదిక ఆధారంగా మద్యం ధరల పెంపుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ధరలు పెరిగితే వినియోగదారులపై అదనపు భారం పడే అవకాశముండగా, పెంపు ఎంత మేర ఉంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం కమిటీ నివేదిక కోసం మద్యం వ్యాపారులు, వినియోగదారులు ఎదురుచూస్తున్నారు.

# ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌లతో కొత్త దిశగా ఆటో రంగం



**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశంలో ప్రత్యామ్నాయ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా ఆటోమొబైల్ రంగం వేగంగా అడుగులు వేస్తోంది. పెట్రోల్‌పై ఆధారాన్ని తగ్గించడం, కాలుష్యాన్ని నియంత్రించడం లక్ష్యంగా ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు ప్రాధాన్యం పెరుగుతోంది. తాజాగా హీరో మోటోకార్ప్ స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ ఫ్యూయల్, హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడళ్లను ప్రవేశపెట్టడంతో ఈ సాంకేతికత మరోసారి చర్చనీయాంశంగా మారింది. భారత్‌లో ఇథనాల్ ఆధారిత ద్విచక్ర వాహనాల ప్రయాణం 2019లో ప్రారంభమైంది. అప్పట్లో టీవీఎస్ మోటార్ కంపెనీ అపాచీ ఆర్‌టీఆర్ 200 ఎఫ్ఐ ఈ100 మోడల్‌ను విడుదల చేసింది. వంద శాతం ఇథనాల్‌తో నడిచే తొలి మోటార్‌సైకిల్‌గా అది గుర్తింపు పొందింది. ఇప్పుడు హీరో మోటోకార్ప్ తీసుకొచ్చిన స్ప్లెండర్ ప్లస్ ఫ్లెక్స్ ఫ్యూయల్, హెచ్‌ఎఫ్ డీలక్స్ ఫ్లెక్స్ ఫ్యూయల్ మోడళ్లు దేశంలోని తొలి భారీ వినియోగదారుల విభాగానికి చెందిన ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌లుగా నిలుస్తున్నాయి. ఈ బైక్‌లు ఈ85 వరకు, అంటే 85 శాతం ఇథనాల్ మిశ్రమ ఇంధనంతో పనిచేసేలా రూపొందించబడ్డాయి. సాధారణ ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన ఈ మోడళ్లు దేశవ్యాప్తంగా ఫ్లెక్స్ ఫ్యూయల్ సాంకేతికతను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా స్ప్లెండర్, హెచ్‌ఎఫ్ డీలక్స్ శ్రేణికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ఆదరణ ఉండటంతో ఈ సాంకేతికత వేగంగా విస్తరించే అవకాశం ఉంది. ఈ బైక్‌లలో 97.2 సీసీ సామర్థ్యం గల ఎయిర్ కూల్డ్ సింగిల్ సిలిండర్ ఇంజిన్‌ను అమర్చారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనంతో పనిచేసేటప్పుడు సాధారణ మోడళ్లతో పోలిస్తే పనితీరు మరింత మెరుగ్గా ఉంటుందని కంపెనీ పేర్కొంది. ఫ్లెక్స్ ఫ్యూయల్ వ్యవస్థలో పెట్రోల్‌తో పాటు ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగించవచ్చు. ఈ20, ఈ85 వంటి గుర్తింపులు ఇంధనంలో ఉన్న ఇథనాల్ శాతాన్ని సూచిస్తాయి. ఉదాహరణకు ఈ85లో 85 శాతం ఇథనాల్, మిగిలిన భాగం పెట్రోల్ ఉంటుంది. దేశంలో చెరకు, ధాన్యాల ద్వారా ఉత్పత్తి అయ్యే ఇథనాల్ వినియోగాన్ని పెంచడం ద్వారా విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి చమురుపై ఆధారాన్ని తగ్గించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇథనాల్ వినియోగం పెరగడం వల్ల రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు దేశీయ బయో ఇంధన రంగానికి కూడా ఊతం లభించనుంది. అయితే ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల విస్తరణకు కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఈ85 వంటి అధిక ఇథనాల్ మిశ్రమ ఇంధనం దేశవ్యాప్తంగా అందుబాటులోకి రావాల్సి ఉంది. పెట్రోల్ బంకుల్లో తగిన మౌలిక సదుపాయాలు ఏర్పడటం, వినియోగదారుల్లో అవగాహన పెరగడం కూడా కీలకంగా మారింది. మొత్తంగా చూస్తే, ఇథనాల్ ఆధారిత ద్విచక్ర వాహనాల రంగంలో భారత్ కొత్త దశలోకి అడుగుపెడుతోంది. పర్యావరణ హిత రవాణా, ఇంధన స్వావలంబన లక్ష్యాల సాధనలో ఫ్లెక్స్ ఫ్యూయల్ బైక్‌లు కీలక పాత్ర పోషించనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.




## ఖనిజ ధరలు పెంచిన ఎన్‌ఎండీసీ

హైదరాబాద్, జూన్ 4: దేశంలోని అతిపెద్ద ఇనుప ఖనిజ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎన్‌ఎండీసీ ఖనిజ ధరలను మరోసారి పెంచింది. ఖనిజాల ధరల సవరణకు సంబంధించి సంస్థ తాజా ప్రకటన విడుదల చేసింది. సంస్థ నిర్ణయం ప్రకారం, బైలా లంప్స్ ఖనిజం టన్ను ధరపై రూ.200 పెంపు చేయగా, నాణ్యమైన ఫైన్స్ రకం ఖనిజం టన్ను ధరను రూ.150 మేర పెంచింది. సవరించిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎన్‌ఎండీసీ వెల్లడించింది. తాజా పెంపుతో బైలా లంప్స్ ఖనిజం టన్ను ధర రూ.5,700కు చేరుకోగా, ఫైన్స్ రకం ఖనిజం టన్ను ధర రూ.4,850గా నిర్ణయించబడింది. ప్రస్తుత త్రైమాసికంలో ఎన్‌ఎండీసీ ఖనిజ ధరలను పెంచడం ఇది మూడోసారి కావడం గమనార్హం. దేశీయ మార్కెట్లో ఇనుప ఖనిజానికి పెరుగుతున్న డిమాండ్, ఉత్పత్తి వ్యయాల పెరుగుదల వంటి అంశాల నేపథ్యంలో సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఖనిజ ధరల పెంపు ప్రభావం ఉక్కు పరిశ్రమపై పడే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. ముడి పదార్థాల వ్యయం పెరగడంతో ఉక్కు తయారీ సంస్థల ఖర్చులు కూడా పెరిగే అవకాశం ఉంది. కాగా, ఎన్‌ఎండీసీ తాజా నిర్ణయం ఖనిజ రంగంలో చర్చనీయాంశంగా మారింది.

## షావోమీ 17టీ విడుదల

**లైకా కెమెరాతో ఆకట్టుకుంటున్న కొత్త ఫోన్**



**న్యూఢిల్లీ, జూన్ 4 :** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ సంస్థ షావోమీ భారత మార్కెట్లో తన కొత్త ప్రీమియం స్మార్ట్‌ఫోన్ 'షావోమీ 17టీ'ను విడుదల చేసింది. లైకా కెమెరా సాంకేతికతతో రూపొందించిన ఈ ఫోన్ ప్రారంభ ధరను రూ.59,999గా నిర్ణయించింది. జూన్ 10వ తేదీ మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికలపై విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ స్మార్ట్‌ఫోన్ రెండు వేరియంట్లలో అందుబాటులోకి రానుంది. 12 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.59,999 కాగా, 12 జీబీ ర్యామ్, 512 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.64,999గా నిర్ణయించారు. బ్యాంక్ ఆఫర్ల కింద రూ.5,000 వరకు తక్షణ తగ్గింపు లభించడంతో ప్రారంభ వేరియంట్‌ను రూ.54,999కే కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఈ ఫోన్‌లో ప్రధాన ఆకర్షణ కెమెరా వ్యవస్థ. లైకా సహకారంతో రూపొందించిన ట్రిపుల్ కెమెరా సెటప్‌ను ఇందులో అందించారు. వెనుక భాగంలో ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ సదుపాయం గల 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరాతో పాటు 5 రెట్లు ఆప్టికల్ జూమ్ అందించే పెరిస్కోప్ టెలిఫొటో లెన్స్‌ను అమర్చారు. ఫొటోగ్రఫీ ప్రియుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన 'లైవ్ మూమెంట్', 'లైవ్ పోర్ట్రెయిట్' వంటి ఫీచర్లను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. డిస్‌ప్లే విషయానికి వస్తే, 6.59 అంగుళాల 1.5కే అమోలెడ్ తెరను ఇందులో ఏర్పాటు చేశారు. 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్, 3500 నిట్స్ గరిష్ఠ ప్రకాశం ఈ ఫోన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ధ్రువీకరణ కూడా పొందింది. పనితీరు పరంగా 6500 ఎంఏహెచ్ సామర్థ్యమున్న సిలికాన్-కార్బన్ బ్యాటరీని అమర్చారు. 67 వాట్ల వేగవంతమైన ఛార్జింగ్ సదుపాయం ఉండటంతో తక్కువ సమయంలోనే బ్యాటరీ పూర్తిగా ఛార్జ్ అవుతుంది. కొత్త తరం ఆపరేటింగ్ వ్యవస్థతో పాటు కృత్రిమ మేధ ఆధారిత పలు ఆధునిక సౌకర్యాలను కూడా ఇందులో పొందుపరిచారు. వైలెట్, నీలం, నలుపు రంగుల్లో ఈ ఫోన్ అందుబాటులోకి రానుంది. విక్రయాల ప్రారంభ ఆఫర్లలో భాగంగా బ్యాంక్ తగ్గింపు లేదా ఎక్స్ఛేంజ్ బోనస్ రూపంలో రూ.5,000 వరకు ప్రయోజనం పొందే అవకాశం కల్పించారు. అలాగే కొనుగోలుదారులకు ప్రత్యేక బైబ్యాక్ హామీతో పాటు పలు డిజిటల్ సేవల ఉచిత సభ్యత్వాలను కూడా అందిస్తున్నారు. అత్యాధునిక కెమెరా, భారీ బ్యాటరీ, కృత్రిమ మేధ ఆధారిత సౌకర్యాలతో వచ్చిన షావోమీ 17టీ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో గట్టి పోటీ ఇవ్వనుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.



## ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు కోహ్లీ దూరం
# అభిమానులకు నిరాశ

**ముంబై, జూన్ 4:** భారత క్రికెట్ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బ్యాటర్, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు దూరం కానున్నట్లు సమాచారం. తొడ వెనుక భాగంలోని కండరాల గాయం కారణంగా ఆయన ఈ సిరీస్‌లో పాల్గొనలేకపోతున్నట్లు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున అద్భుత ప్రదర్శన చేసిన కోహ్లీ, జట్టుకు కీలక విజయాలు అందించాడు. ఫైనల్ మ్యాచ్ సందర్భంగా పరుగులు తీసే సమయంలో గాయం తీవ్రత పెరిగినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. జూన్ 13 నుంచి ప్రారంభమయ్యే వన్డే సిరీస్‌కు తొలుత కోహ్లీ ఎంపికయ్యాడు. అయితే తాజా గాయం కారణంగా మొత్తం సిరీస్‌కు దూరమయ్యే అవకాశం ఉందని జాతీయ మాధ్యమాలు పేర్కొన్నాయి. ఇక భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటుపైనా ఇంకా స్పష్టత లేదు. ఆయన కూడా గాయం నుంచి కోలుకుంటున్న నేపథ్యంలో తుది ఫిట్‌నెస్ అనుమతి కోసం ఎదురుచూస్తున్నారు. టెస్టు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్‌పైనే దృష్టి సారించాడు. ఇలాంటి సమయంలో గాయం కారణంగా సిరీస్‌కు దూరం కావడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. అయితే ఆయన త్వరగా కోలుకుని తదుపరి అంతర్జాతీయ సిరీస్‌లకు అందుబాటులోకి వస్తారని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డే జూన్ 13న ధర్మశాలలో, రెండో వన్డే జూన్ 17న లక్నోలో, మూడో వన్డే జూన్ 20న చెన్నైలో జరగనుంది.



## 17 ఏళ్లుగా నాపై ఒక్క నేరం కూడా
# రుజువు కాలేదు

**లలిత్ మోదీ**

**న్యూఢిల్లీ, జూన్ 4 :** ఐపీఎల్ మాజీ చైర్మన్ లలిత్ మోదీ తాజాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనపై వస్తున్న ఆరోపణలు, భారత అధికారుల నుంచి తప్పించుకుని విదేశాల్లో ఉంటున్నాననే ప్రచారంపై స్పందించారు. తాను ఎవరి నుంచి పారిపోవడం లేదని, తనపై ఇప్పటివరకు ఎలాంటి నేరం కూడా రుజువు కాలేదని స్పష్టం చేశారు. భారత అధికారుల నుంచి విజయవంతంగా దాక్కుంటున్నానంటూ వస్తున్న కథనాలను ఆయన ఖండించారు. అలాంటి ప్రచారం కేవలం మీడియా సంచలనాల కోసం చేస్తున్నదేనని ఆరోపించారు. న్యాయపరంగా తాను అందుబాటులోనే ఉన్నానని, ఎక్కడికీ పారిపోలేదని చెప్పారు. భారత్ వంటి ప్రపంచ శక్తివంతమైన దేశం నుంచి తప్పించుకోవడం అసాధ్యమని వ్యాఖ్యానించారు. "నిజంగా నేను పారిపోతుంటే నన్ను పట్టుకోవడం భారత ప్రభుత్వానికి కష్టమైన పని కాదు. ప్రభుత్వానికి అపారమైన సామర్థ్యం ఉంది. ప్రభుత్వంతో నాకు ఎలాంటి విభేదాలు లేవు. కానీ మీడియా మాత్రం విషయాలను అతిశయోక్తిగా చూపిస్తోంది" అని లలిత్ మోదీ అన్నారు. మీడియాపై కూడా ఆయన తీవ్ర విమర్శలు చేశారు. దేశంలో పరువునష్టం చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మీడియా సంస్థలు బాధ్యతారహితంగా వార్తలు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం లలిత్ మోదీపై మనీలాండరింగ్, విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం ఉల్లంఘనలకు సంబంధించిన కేసులపై దర్యాప్తు కొనసాగుతోంది. అయితే ఇప్పటివరకు తనపై ఎలాంటి నేరపూరిత ఆరోపణలు రుజువు కాలేదని ఆయన పేర్కొన్నారు. భారత న్యాయవ్యవస్థపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. "దేశంలో న్యాయం చాలా ఆలస్యంగా లభిస్తోంది. ఆలస్యంగా వచ్చే న్యాయం కూడా ఒక విధంగా శిక్షలాంటిదే" అని వ్యాఖ్యానించారు. అలాగే, ఇప్పట్లో భారత్‌కు తిరిగి వచ్చే ఆలోచన లేదని స్పష్టం చేశారు. "17 ఏళ్లుగా నన్ను కోర్టుకు తీసుకెళ్లలేదు. ఒకవేళ నాపై ఏదైనా బలమైన కేసు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ ఇప్పటివరకు అలాంటిదేమీ జరగలేదు" అని తెలిపారు. కాగా, ఐపీఎల్ ప్రారంభ దశలో చైర్మన్‌గా ఉన్న సమయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, అక్రమాలపై అమలు నిర్వహణ సంచాలక సంస్థ దర్యాప్తు కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

# ఇండోనేషియా ఓపెన్‌లో సింధుకు నిరాశ

**జకార్తా, జూన్ 4 :** ఒలింపిక్ పతక విజేత, భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో నిరాశ ఎదురైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రౌండ్-16 పోరులో ప్రపంచ నంబర్-1 క్రీడాకారిణి ఆన్ సే యంగ్ చేతిలో ఆమె పరాజయం పాలయ్యారు. ఈ మ్యాచ్‌లో దక్షిణ కొరియా క్రీడాకారిణి ఆన్ సే యంగ్ 21-17, 21-14 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధించారు. దీంతో సింధు టోర్నీ నుంచి నిష్క్రమించారు. మ్యాచ్ తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఒక దశలో ఇద్దరూ 10-10 స్కోరుతో సమంగా నిలిచారు. సింధు తన ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచుతూ 15-14 ఆధిక్యంలోకి వెళ్లారు. అయితే ఆ తర్వాత ఆన్ సే యంగ్ దూకుడుగా ఆడుతూ వరుస పాయింట్లు సాధించారు. చివర్లో జరిగిన 41 షాట్ల సుదీర్ఘ ర్యాలీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం తొలి గేమ్‌ను 21-17తో ఆన్ సే యంగ్ సొంతం చేసుకున్నారు. రెండో గేమ్‌లో కూడా కొరియా స్టార్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. సింధుకు పెద్దగా అవకాశాలు ఇవ్వకుండా 21-14తో గేమ్‌ను ముగించి మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. గత వారం జరిగిన సింగపూర్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌లో కూడా సింధు ఆన్ సే యంగ్ చేతిలోనే ఓడిపోయిన విషయం తెలిసిందే.



దీంతో వరుసగా రెండో టోర్నీలో కొరియా క్రీడాకారిణి చేతిలో పరాజయం పాలయ్యారు. ఇప్పటివరకు పీవీ సింధు, ఆన్ సే యంగ్ మధ్య 10 మ్యాచ్‌లు జరగగా, అన్ని మ్యాచ్‌ల్లోనూ ఆన్ సే యంగ్ విజయం సాధించారు. ఇప్పటివరకు ఆమెపై సింధు ఒక్క విజయాన్ని కూడా నమోదు చేయలేకపోవడం గమనార్హం. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్న ఆన్ సే యంగ్ మరోసారి తన స్థాయిని నిరూపించుకోగా, సింధు తదుపరి టోర్నీల్లో మెరుగైన ప్రదర్శనతో పునరాగమనం చేయాలని అభిమానులు ఆశిస్తున్నారు.

# సూర్యకు కెప్టెన్సీ గండం?

**న్యూఢిల్లీ, జూన్ 4 :** టీ20 ప్రపంచకప్‌ను భారత జట్టుకు అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు భారీ షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్, జులై నెలల్లో జరగనున్న ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు ముందే అతడిని టీ20 జట్టు సారథ్య బాధ్యతల నుంచి తప్పించే దిశగా భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆలోచిస్తున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. గత కొంతకాలంగా సూర్యకుమార్ యాదవ్ తీవ్ర ఫామ్ లేమితో ఇబ్బందులు పడుతుండటమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. ఒకప్పుడు ప్రపంచ టీ20 క్రికెట్‌లో అగ్రశ్రేణి బ్యాటర్‌గా గుర్తింపు పొందిన సూర్యకుమార్ యాదవ్, ప్రస్తుతం పరుగులు చేయడంలో తడబడుతున్నాడు. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో కూడా అతడి ప్రదర్శన నిరాశపరిచింది. ముంబై జట్టు తరఫున 13 ఇన్నింగ్స్‌ల్లో బ్యాటింగ్ చేసిన అతడు కేవలం 270 పరుగులు మాత్రమే సాధించాడు. 2017 తర్వాత అతడికి ఇదే అత్యంత పేలవమైన లీగ్ సీజన్‌గా నమోదైంది. ఈ పరిస్థితుల్లో సూర్యను కేవలం కెప్టెన్సీ నుంచే కాకుండా జట్టు నుంచి కూడా తప్పించే అవకాశాలపై చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, ప్రధాన ఎంపికల కమిటీ అధిపతి అజిత్ అగార్కర్‌లతో భారత క్రికెట్ బోర్డు ఉన్నతాధికారులు ఇప్పటికే సమావేశమై భవిష్యత్ వ్యూహంపై చర్చించినట్లు తెలుస్తోంది. రాబోయే టీ20 సిరీస్‌ల కోసం కొత్త కెప్టెన్ ఎంపిక ప్రక్రియను ప్రారంభించాలని సూచించినట్లు క్రీడా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. భారత జట్టు భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వాలని బోర్డు భావిస్తున్నట్లు సమాచారం. సూర్య నాయకత్వంలో ప్రపంచకప్ గెలిచినప్పటికీ, అతడి వ్యక్తిగత ప్రదర్శనలో నిలకడ లేకపోవడం ఆందోళన కలిగిస్తున్న అంశంగా మారింది. ఈ నేపథ్యంలో త్వరలోనే అతడికి బోర్డు తన నిర్ణయాన్ని తెలియజేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉండగా, కొత్త కెప్టెన్ ఎంపికలో పలువురు ఆటగాళ్ల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, హైదరాబాద్‌కు చెందిన యువ బ్యాటర్ తిలక్ వర్మ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. వీరిలో ఒకరికి టీ20 జట్టు పగ్గాలు అప్పగించే అవకాశముందని క్రీడా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై భారత క్రికెట్ బోర్డు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.






# పంత్‌కు కీలక సూచనలు

**న్యూఢిల్లీ, జూన్ 4 :** భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ తన బ్యాటింగ్‌లో మరింత బాధ్యతాయుతమైన విధానాన్ని అవలంబించాలని భారత జట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డష్కాటే సూచించారు. అఫ్గానిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ పంత్ ఆటతీరు, నాయకత్వ లక్షణాలు, ఇటీవల జరిగిన మార్పులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల భారత క్రికెట్ నియంత్రణ మండలి అఫ్గానిస్థాన్‌తో టెస్టు మ్యాచ్ కోసం జట్టును ప్రకటించిన సమయంలో రిషభ్ పంత్‌ను ఉప కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. ఈ నిర్ణయం గురించి స్పందించిన సహాయ కోచ్, ఆ మార్పును పంత్ ఎంతో పరిణితితో స్వీకరించాడని తెలిపారు. ఉప కెప్టెన్ హోదా లేకపోయినా జట్టులో నాయకత్వ లక్షణాలు ప్రదర్శించవచ్చని, అధికారిక పదవి లేకపోవడం వల్ల ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నారు. పంత్ తన సహజమైన దూకుడు ఆటతీరుతో భారత జట్టుకు అనేక మరపురాని విజయాలు అందించినప్పటికీ, కొన్ని సందర్భాల్లో పరిస్థితులకు అనుగుణంగా ఆడకుండా వికెట్ కోల్పోతున్నాడనే విమర్శలు కూడా ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో మ్యాచ్ పరిస్థితులను అర్థం చేసుకుని ఆడటం అత్యంత ముఖ్యమని కోచింగ్ బృందం భావిస్తున్నట్లు సమాచారం. అవసరమైన సమయంలో ఓర్పుతో ఆడటం, జట్టు అవసరాలకు అనుగుణంగా ఇన్నింగ్స్‌ను నిర్మించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. రిషభ్ పంత్ ఇప్పటివరకు 49 టెస్టు మ్యాచ్‌లు ఆడి 3,476 పరుగులు సాధించాడు. సగటు 42.91గా ఉంది. విదేశీ గడ్డపై ఎన్నో కీలక ఇన్నింగ్స్ ఆడిన అతడు భారత జట్టులో అత్యంత ప్రభావవంతమైన ఆటగాళ్లలో ఒకడిగా గుర్తింపు పొందాడు. అయితే ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఆ సిరీస్‌లో కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగాడు. దీంతో అతడి ఫామ్‌పై చర్చలు జరిగాయి. అఫ్గానిస్థాన్‌తో జరిగే టెస్టు మ్యాచ్‌లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. కేఎల్ రాహుల్ ఉప కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. పంత్ కూడా జట్టులో కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. ఈ మ్యాచ్‌లో అతడి ప్రదర్శనపై అభిమానులతో పాటు జట్టు యాజమాన్యం కూడా ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇటీవల ఎదురైన విమర్శలకు సమాధానంగా నిలిచే అవకాశంగా ఈ మ్యాచ్‌ను పంత్ వినియోగించుకోవాలని మాజీ క్రికెటర్లు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితులకు అనుగుణంగా ఆడుతూ తన సహజ ప్రతిభను ప్రదర్శిస్తే భారత జట్టుకు కీలక విజయాన్ని అందించే సామర్థ్యం పంత్‌కు ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# పటిదార్‌కు గుర్తింపు కావాలి

**మెల్‌బోర్న్, జూన్ 4 :** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటిదార్‌కు రావాల్సిన స్థాయిలో గుర్తింపు లభించడం లేదని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ అభిప్రాయపడ్డాడు. జట్టులో విరాట్ కోహ్లీ వంటి స్టార్ ఆటగాడు ఉండటం వల్ల పటిదార్ ప్రదర్శనలు పెద్దగా చర్చకు రావడం లేదని పేర్కొన్నాడు. ఇటీవల ఓ క్రికెట్ చర్చా కార్యక్రమంలో మాట్లాడిన క్లార్క్, ఐపీఎల్ 2026 సీజన్‌లో తన దృష్టిలో అత్యంత తక్కువ గుర్తింపు పొందిన ఆటగాడు రజత్ పటిదారేనని వ్యాఖ్యానించాడు. ఆర్‌సీబీకి వరుసగా రెండు సార్లు టైటిల్ అందించిన కెప్టెన్‌గా, జట్టును విజయవంతంగా ముందుండి నడిపించిన నాయకుడిగా పటిదార్ మరింత ప్రశంసలు అందుకోవాల్సిన అవసరం ఉందని చెప్పాడు. జట్టులో కోహ్లీ వంటి దిగ్గజ ఆటగాడు ఉండటంతో సహజంగానే ఎక్కువ చర్చ అతని చుట్టూనే జరుగుతుందని, అయితే




పటిదార్ నాయకత్వం, బ్యాటింగ్ ప్రదర్శనలను కూడా అదే స్థాయిలో గుర్తించాలని క్లార్క్ సూచించాడు. ఒక కెప్టెన్‌గా ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టడంలో పటిదార్ అద్భుతమైన సామర్థ్యాన్ని కనబరిచాడని కొనియాడాడు. టీ20 క్రికెట్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడం అత్యంత క్లిష్టమైన బాధ్యత అని, అలాంటి కీలక స్థానంలో వచ్చి దూకుడుగా పరుగులు చేయడం పటిదార్ ప్రత్యేకత అని క్లార్క్ వివరించాడు. మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడుతూ జట్టుకు అవసరమైన వేగంతో పరుగులు సాధించడం అతని బలమని పేర్కొన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో పటిదార్ సుమారు 200 స్ట్రైక్‌రేట్‌తో 501 పరుగులు సాధించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. బ్యాటర్‌గా మాత్రమే కాకుండా కెప్టెన్‌గా కూడా అతడు అసాధారణ ప్రతిభ కనబరిచాడని క్లార్క్ అభిప్రాయపడ్డాడు. పటిదార్ నిలకడైన ప్రదర్శనలు, నాయకత్వ నైపుణ్యాలను పరిగణనలోకి తీసుకుని భారత టీ20, వన్డే జట్ల ఎంపికలో అతనికి ప్రాధాన్యం ఇవ్వాలని క్లార్క్ సూచించాడు. వరుసగా రెండు ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన కెప్టెన్‌గా అతని పేరు భారత జట్టు ఎంపికలో ముందువరుసలో ఉండాలని స్పష్టం చేశాడు. ప్రస్తుతం దేశీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లోనూ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న పటిదార్, భవిష్యత్తులో భారత జట్టులో కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# శింబుతో సినిమా చూడాలనుంది: మీనాక్షి

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న కథానాయిక మీనాక్షి చౌదరి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటున్న ఈ అందాల నటి, ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమిళ స్టార్ హీరో శింబుపై తన అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలో భాగంగా "సినీ పరిశ్రమకు చెందిన ఏ హీరోతోనైనా సినిమా చూడడానికి వెళ్లే అవకాశం వస్తే ఎవరిని ఎంచుకుంటారు?" అనే ప్రశ్నకు మీనాక్షి ఏమాత్రం ఆలోచించకుండా శింబు పేరును చెప్పారు. "సినిమా చూడటానికి వెళ్లాలంటే నేను ఖచ్చితంగా శింబు గారినే ఎంచుకుంటాను" అంటూ సమాధానమిచ్చారు. ఆయన నటన, తెరపై కనిపించే తీరు తనకు ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. మీనాక్షి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా శింబు అభిమానులు ఈ వ్యాఖ్యలను ఆనందంగా స్వాగతిస్తూ, వీరిద్దరి కలయికలో ఒక చిత్రం వస్తే చూడాలని ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, తమిళ సినీ వర్గాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం శింబు కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఓ భారీ చిత్రంలో మీనాక్షి చౌదరి కథానాయికగా నటించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వార్తల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రస్తుతం మీనాక్షి చౌదరి తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమల్లో బిజీగా గడుపుతున్నారు. వరుస విజయాలతో ఆమెకు 'అదృష్ట కథానాయిక' అనే పేరు కూడా వచ్చింది. తెలుగులో పలు ప్రతిష్టాత్మక చిత్రాల్లో నటిస్తూనే, తమిళంలోనూ వరుస అవకాశాలను అందుకుంటున్నారు. హర్యానాకు చెందిన మీనాక్షి చౌదరి వృత్తిరీత్యా దంత వైద్యురాలు. విద్యాభ్యాసం పూర్తయ్యాక మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి జాతీయ స్థాయి అందాల పోటీల్లో గుర్తింపు పొందారు. అనంతరం సినీ రంగంలోకి ప్రవేశించి తన అందం, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ అగ్ర కథానాయికల జాబితాలో చోటు సంపాదించారు. ప్రస్తుతం ఆమె నటిస్తున్న కొత్త చిత్రాలపై కూడా సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వరుస విజయాలతో ముందుకు సాగుతున్న మీనాక్షి చౌదరి పేరు మరోసారి వార్తల్లో నిలవడానికి శింబుపై చేసిన ఈ వ్యాఖ్యలే కారణమయ్యాయి.



# 'పెద్ది' సంబరాల్లో ఉపాసన సందడి

థియేటర్‌లో కేరింతలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన భారీ స్పోర్ట్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'పెద్ది' విడుదలతో తెలుగు రాష్ట్రాల్లో పండుగ వాతావరణం నెలకొంది. సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌తో పాటు పలు నగరాల్లోని థియేటర్ల వద్ద అభిమానులు భారీ ఎత్తున చేరుకుని సంబరాలు జరుపుకుంటున్నారు. భారీ కటౌట్లు, బ్యానర్లు, డప్పుల మోతలు, బాణాసంచా కాల్పులతో మెగా అభిమానులు థియేటర్ల పరిసరాలను ఉత్సవ వాతావరణంగా మార్చేశారు.సినిమాపై నెలకొన్న భారీ అంచనాల నడుమ హైదరాబాద్‌లోని విమల్ 700 ఎంఎం థియేటర్‌లో ప్రత్యేక ప్రీమియర్ షోను నిర్వహించారు. ఈ ప్రీమియర్ షోకు రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల హాజరై అభిమానులతో కలిసి సినిమా వీక్షించారు. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ ఎంట్రీ సన్నివేశాలు, యాక్షన్ ఘట్టాలు తెరపై కనిపించిన సమయంలో ఉపాసన ఎంతో ఉత్సాహంగా స్పందించారు. కేకలు వేస్తూ, విజిల్స్ వేస్తూ, పేపర్లు విసురుతూ అభిమానులతో కలిసి ఆమె చేసిన సందడి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. థియేటర్‌లో సాధారణ ప్రేక్షకురాలిలా సినిమా ఆస్వాదించిన ఆమె వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమా విడుదల సందర్భంగా సినీ ప్రముఖులు కూడా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. హీరో వరుణ్ తేజ్ సామాజిక మాధ్యమాల ద్వారా స్పందిస్తూ, రామ్ చరణ్ ఈ చిత్రం కోసం ఎంత కష్టపడ్డారో తనకు తెలుసని పేర్కొన్నారు. ఆయన అంకితభావం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అలాగే దర్శకుడు బుచ్చిబాబు, సంఉత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ సహా మొత్తం చిత్రబృందానికి అభినందనలు తెలుపుతూ సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. అదే విధంగా నటి సమంత రూత్ ప్రభు కూడా 'పెద్ది'పై ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని, రామ్ చరణ్ ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆమె పేర్కొన్నారు. చరణ్ ఈ పాత్ర కోసం ఎంతో శ్రమించారని, మొత్తం చిత్రబృందానికి తన శు భాకాంక్షలు తెలియజేస్తున్నానని చెప్పారు. సినిమా విజయం సాధించే అన్ని లక్షణాలు కనిపిస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉ ండగా, ప్రస్తుతం పొల్లాచిలో చిత్రీకరణ జరుపుకుంటున్న 'మెగా 158' చిత్రబృందం కూడా సెట్స్ నుంచే 'పెద్ది' టీంకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసింది. రామ్ చరణ్, బుచ్చిబాబు, నిర్మాణ సంస్థకు విజయాభినందనలు తెలుపుతూ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో కూడా అభిమానుల మధ్య మంచి ఆదరణ పొందుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి సైతం 'పెద్ది' చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ప్రారంభం నుంచే ఈ సినిమా ప్రయాణం ఆసక్తిని కలిగించిందని పేర్కొన్న ఆయన, రామ్ చరణ్ చేసిన శారీరక మార్పులు, పాత్ర కోసం చూపిన నిబద్ధత అసాధారణమని కొనియాడారు. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి, చాలా కాలం గుర్తుండిపోయే చిత్రంగా నిలవాలని ఆకాంక్షించారు.ఇప్పటికే ప్రీమియర్ షోల నుంచి వస్తున్న స్పందనతో అభిమానుల్లో మరింత ఉత్సాహం పెరిగింది. గ్రామీణ క్రీడల నేపథ్యంతో రూపొందిన ఈ చిత్రంలో రామ్ చరణ్ కొత్త అవతారంలో కనిపించడంతో ప్రేక్షకులు భారీగా ఆకర్షితులవుతున్నారు. విడుదల రోజునే థియేటర్ల వద్ద కనిపిస్తున్న హడావుడి చూస్తుంటే, 'పెద్ది' మెగా అభిమానులకు ఒక భారీ వేడుకగా మారిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# బిస్కెట్ ప్రకటనతో మారిన రమ్యకృష్ణ జీవితం

సినీ పరిశ్రమలో ఎంతోమంది కథానాయికలు కొద్ది సినిమాలకే పరిమితమవుతుంటే, మరికొందరు మాత్రం దశాబ్దాల పాటు తమ ప్రస్థానాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ప్రేక్షకుల అభిమానాన్ని సొంతం చేసుకుంటారు. అలాంటి అరుదైన నటీమణుల్లో రమ్యకృష్ణ ఒకరు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 200కు పైగా చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. రమ్యకృష్ణ సినీ ప్రస్థానం వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. ఆమెను చిత్రసీమకు పరిచయం చేయడంలో ఒక బిస్కెట్ ప్రకటన కీలక పాత్ర పోషించిందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అప్పట్లో తమిళంలో తెరకెక్కుతున్న 'వెళ్లై మనసు' చిత్రానికి ప్రధాన పాత్ర కోసం నిర్మాతలు కొత్త ముఖాన్ని వెతుకుతున్న సమయంలో, ఒక పత్రికలో ప్రచురితమైన బిస్కెట్ ప్రకటనలో రమ్యకృష్ణ ఫొటో కనిపించిందట. ఆమె రూపం నచ్చడంతో వివరాలు సేకరించగా, ప్రముఖ పాత్రికేయుడు, విమర్శకుడు చో రామస్వామికి మేనకోడలు అని తెలిసినట్లు సమాచారం. దీంతో చిత్రబృందం చో రామస్వామిని సంప్రదించి రమ్యకృష్ణను సినిమాలో నటింపజేయాలని కోరిందట. అనంతరం దర్శకుడు స్వయంగా వెళ్లి ఆమెను కలవడంతో 'వెళ్లై మనసు' చిత్రంలో కథానాయికగా అవకాశం లభించింది. ఆ సమయంలో రమ్యకృష్ణ ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని కావడం విశేషం. తమిళంలో తొలి చిత్రం చేసిన తర్వాత 'బాల్యమిత్రులు' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం వరుస విజయాలతో అగ్ర కథానాయికగా ఎదిగి, దక్షిణ భారత సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేశారు. అందం, అభినయం, వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించిన రమ్యకృష్ణ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఒక చిన్న ప్రకటనతో ప్రారంభమైన ప్రయాణం, నేడు భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత గౌరవనీయ నటీమణుల్లో ఒకరిగా రమ్యకృష్ణను నిలబెట్టిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

# అర్జున్ ఇంట పెళ్లి సందడి?





దక్షిణ భారత సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా కుటుంబంలో త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నాయనే వార్తలు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆయన చిన్న కుమార్తె అంజనా సర్జా ఈ ఏడాది అక్టోబర్ నెలలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.కన్నడ చిత్రసీమలో కథానాయకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన అర్జున్ సర్జా, తెలుగు, తమిళ భాషల్లోనూ అనేక విజయవంతమైన చిత్రాల్లో నటించి ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించారు. ప్రస్తుతం నటుడిగా, నిర్మాతగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఆయన కుటుంబ పరంగా కూడా ఆదర్శ తండ్రిగా ప్రశంసలు అందుకుంటున్నారు. అర్జున్ పెద్ద కుమార్తె ఐశ్వర్య సర్జా సినీ రంగంలో నటిగా కొనసాగుతుండగా, చిన్న కుమార్తె అంజనా సర్జా మాత్రం వ్యాపార రంగాన్ని ఎంచుకున్నారు. అమెరికాలోని ప్రముఖ విద్యాసంస్థలో ఫ్యాషన్ డిజైన్ విద్యను అభ్యసించిన అంజనా, ప్రస్తుతం ఫ్యాషన్ డిజైనర్‌గా, వ్యాపారవేత్తగా మంచి గుర్తింపు పొందారు. ఆమె స్థాపించిన 'సర్జా' సంస్థ పర్యావరణహిత విలాసవంతమైన చేతి సంచుల తయారీలో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. పండ్ల వ్యర్థాలు, యాపిల్, పైనాపిల్, కాక్టస్ వంటి సహజ పదార్థాలతో రూపొందించే ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తోంది. వ్యక్తిగత జీవితానికి వస్తే, అంజనా గత పదమూడు సంవత్సరాలుగా అమెరికాకు చెందిన ఓ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు సమాచారం. విదేశాల్లో చదువుకునే సమయంలో ప్రారంభమైన పరిచయం కాలక్రమేణా ప్రేమగా మారిందని తెలుస్తోంది. గత ఏడాది ఇటలీలోని ప్రముఖ పర్యాటక ప్రాంతంలో కుటుంబ సభ్యుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ వేడుకను అత్యంత గోప్యంగా నిర్వహించినట్లు కూడా ప్రచారం జరిగింది. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వినిపిస్తున్న కథనాల ప్రకారం, అంజనా మరియు ఆమె కాబోయే జీవిత భాగస్వామి అక్టోబర్ నెలలో వివాహం చేసుకోనున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే పెళ్లి ఏర్పాట్లు కూడా ప్రారంభమైనట్లు కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తలపై అర్జున్ సర్జా కుటుంబం నుంచి ఎలాంటి అధికారిక స్పష్టత రాకపోవడంతో, అభిమానులు అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848899998, editor@churakalu.com